TGTEL/25/A3750

... నిజమే ...

# నిజాయితి

https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

"నిజాయితీ" ఒక ముఖ్యమైన నైతిక లక్షణం ఇది విశ్వసనీయత, విధేయత మరియు సమగ్రతను పెంచుతుంది.

ఎడిటర్ : బొడ్డుపల్లి మల్లయ్య   సంపుటి 1   సంచిక 55   నెట్‌వర్క్ ఇంచార్జ్ & మెయింటెనెన్స్ : గుండూర్ శ్యామ్ .   సోమవారం 12 జనవరి 2026   వెల 4:00

## ఇక నుంచి ఇద్దరు ఎమ్మార్వోలు.. మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు



**రంగారెడ్డి , జనవరి 10 (నిజాయితి) :** తెలంగాణలోని అధిక జనాభా ఉన్న పట్టణ ప్రాంతాల్లో పరిపాలనను వేగవంతం చేసేందుకు అదనపు తహశీల్దార్లను (వీ=ా) నియమించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. లక్షన్నర నుండి రెండు లక్షల జనాభా ఉన్న పట్టణాల్లో ఒకే ఎమ్మార్వోపై పనిభారం ఎక్కువగా ఉన్నందున, త్వరలోనే కేబినెట్ ఆమోదంతో అదనపు అధికారులను కేటాయిస్తామని తెలిపారు. పెద్దపల్లిలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం కమిషన్ల కోసమే కాళేశ్వరం కట్టిందని, పేదల ఇళ్ల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. తెలంగాణలోని ప్రధాన పట్టణాల్లో పరిపాలనను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జనాభా ఎక్కువగా ఉన్న పట్టణ ప్రాంతాల్లో ఇకపై అదనపు తహశీల్దార్లను (వీ=ా) నియమించనున్నట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. పెద్దపల్లి జిల్లా పర్యటనలో భాగంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఒకటిన్నర లక్షల నుండి రెండు లక్షల జనాభా ఉన్న పట్టణాలు అనేకం ఉన్నాయి. ఇంత భారీ జనాభాకు కేవలం ఒక్కరే తహశీల్దార్ ఉండటం వల్ల రెవెన్యూ సేవల్లో జాప్యం జరుగుతోందని ప్రభుత్వం గుర్తించింది. భూముల సర్వేలు, ధరణి సమస్యలు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఇతర ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం జరగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రతిపాదనను త్వరలోనే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆమోదించనున్నారు. తద్వారా పట్టణాల్లో పనుల భారం తగ్గి, సామాన్యులకు త్వరగా సేవలు అందుతాయి. ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల వల్లే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిందని, మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే జోరు కొనసాగుతుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. పెద్దపల్లి సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రతిపక్ష నేత కేటీఆర్ పైన కూడా ఘాటు విమర్శలు చేశారు. వరుస ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని తిరస్కరిస్తున్నా.. మున్సిపల్ ఎన్నికల్లో గెలుస్తామని కేటీఆర్ పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. సొంత కుటుంబంలోని ఆడబిడ్డకు న్యాయం చేయలేని వారు, రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వం కేవలం కమిషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిందని, పేదలకు ఇళ్లు కట్టాలనే ఆలోచన చేయలేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ వంటి పనులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని, త్వరలోనే శుభవార్త వింటారని భరోసా ఇచ్చారు. పట్టణాల్లో ఇద్దరు ఎమ్మార్వోల నియామకం అనేది తెలంగాణ రెవెన్యూ వ్యవస్థలో ఒక విప్లవాత్మక మార్పుగా ఉండబోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## నేటి నుంచి శ్రీశైలంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు





**శ్రీశైలం, జనవరి (నిజాయితి) :** మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకొని శ్రీశైల శ్రీ మల్లికార్జునస్వామి వారి ఆలయంలో జనవరి 12 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడురోజులపాటు పంచాహ్నిక దీక్షతో జరిగే ఈ ఉత్సవాలు 18వ తేదీన ముగియనున్నాయి. 12వ తేదీ ఉదయం 9.15 గంటలకు యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం చతుర్వేద పఠనం, బ్రహ్మోత్సవ సంకల్పం, గణపతి పూజ, చండీశ్వర ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతుంది. 13వ తేదీ నుంచి స్వామిఅమ్మవార్లకు వాహన సేవలు నిర్వహించనుండగా, 15వ తేదీ మకర సంక్రాంతి రోజున బ్రహ్మోత్సవ కల్యాణం జరుగుతుంది. 17వ తేదీన యాగపూర్ణాహుతి, త్రిశూలస్నానం, ధ్వజావరోహణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. చివరి రోజు 18వ తేదీ రాత్రి పుష్పోత్సవం, శయనోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా జనవరి 12 నుంచి 18వ తేదీ వరకు కొన్ని ఆర్జిత సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

## ధరణి, భూ భారతి పోర్టల్ లోపాలతో భారీ స్కాం.. రూ. 42 కోట్లు సైలెంట్‌గా కొట్టేశారు..!

- ధరణి, భూ భారతి పోర్టల్ లోపాలతో భారీ స్కాం
- రూ. 42 కోట్ల స్టాంప్ డ్యూటీ కొట్టేశారు.
- సీసీఎల్ఏ ఆడిట్‌లో వెలుగులోకి వాస్తవాలు







**హైదరాబాద్, జనవరి 11 (నిజాయితి) :** అంబర్‌పేట ఎస్సై ధరణి, భూ భారతి పోర్టల్ లోపాలతో భారీ స్కాం.. రూ. 42 కోట్లు సైలెంట్‌గా కొట్టేశారు..! తెలంగాణలో భూముల రిజిస్ట్రేషన్లలో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ధరణి, భూ భారతి పోర్టల్ లోని సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుని మీసేవ నిర్వాహకులు, మధ్యవర్తులు ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన రూ. 42 కోట్ల స్టాంప్ డ్యూటీ సొమ్మును అక్రమంగా మళ్లించారు. సీసీఎల్ఏ ఆడిట్ చేయగా.. 4,300 లావాదేవీల్లో నగదు వ్యత్యాసం ఉన్నట్లు తేలింది. తెలంగాణ భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో భారీ కుంభకోణం వెలుగుచూసింది. ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన స్టాంప్ డ్యూటీ సొమ్మును అక్రమార్కులు పక్కదారి పట్టించారు. ధరణి నుంచి నేటి భూ భారతి వరకు పోర్టల్‌లోని సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుని గత ఆరేళ్లుగా ఈ అక్రమ దందా కొనసాగడం విస్తుగొలుపుతోంది. 2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల బాధ్యతను రిజిస్ట్రేషన్ శాఖ నుంచి తహసీల్దార్లకు అప్పగించిన నాటి నుంచి ఈ లొసుగులు మొదలయ్యాయి. గత ఆరేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 52 లక్షల లావాదేవీలను సీసీఎల్ఏ ఆడిట్ చేయగా.. అందులో 4,300 లావాదేవీల్లో నగదు వ్యత్యాసం ఉన్నట్లు తేలింది. సుమారు రూ. 42 కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి ఆ సొమ్మును మీసేవ కేంద్రాల నిర్వాహకులు, కొందరు మధ్యవర్తులు తమ ఖాతాలకు మళ్లించుకున్నట్లు అధికారులు గుర్తించారు. రిజిస్ట్రేషన్ శాఖలో ప్రతి చలానాను మూడు దశల్లో తనిఖీ చేసే పటిష్టమైన వ్యవస్థ ఉంది. కానీ రెవెన్యూ శాఖ పరిధిలోని అప్పటి ధరణి, ప్రస్తుత భూ భారతి పోర్టల్‌లో అటువంటి క్రాస్-చెక్ వ్యవస్థ లేదు. మీసేవ నిర్వాహకులు ఇచ్చే ఇన్‌పుట్స్‌ను లేదా వారు జనరేట్ చేసే చలానా మొత్తాన్ని సరిచూసే సాంకేతిక పరిజ్ఞానాన్ని పోర్టల్‌కు అనుసంధానం చేయలేదు. రిజిస్ట్రేషన్ శాఖలో మార్కెట్ విలువ ప్రకారం స్టాంప్ డ్యూటీ లెక్కిస్తారు. కానీ రెవెన్యూలో మాత్రం తక్కువ విలువనే పరిగణనలోకి తీసుకునే వెసులుబాటు ఉండటం అక్రమార్కులకు వరంగా మారింది. గత ఆరేళ్లుగా ఎలాంటి ఆడిట్ జరగకపోవడం వల్ల ఈ అక్రమాలు నిర్విఘ్నంగా సాగాయి. ఎమ్మార్వో కార్యాలయాల్లో రోజువారీ రిజిస్ట్రేషన్లు, జమైన చలానా సొమ్మును సరిచూసే వ్యవస్థ లేకపోవడం మరో ప్రధాన లోపం. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 4,300 అవకతవకల లావాదేవీల్లో ఎక్కువగా రంగారెడ్డి జిల్లాలోనే 2,100 లావాదేవీలు జరిగాయని సీసీఎల్ఏ డీఎస్ లోకేష్ కుమార్ తెలిపారు. ఆ తర్వాత యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,300, జనగామ, ఇతర జిల్లాల్లో మిగిలిన 900 లావాదేవీల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ స్కామ్ తీవ్రతను గుర్తించిన సీసీఎల్ఏ.. పక్కదారి పట్టిన రూ. 42 కోట్లను వెంటనే రికవరీ చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఉండేందుకు భూ భారతి పోర్టల్‌ను రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌తో అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## ఎన్నికల హామీ నిలబెట్టుకున్న ఇద్దరు సర్పంచ్‌లు.. కేసు నమోదు చేసిన పోలీసులు,



**హనుమకొండ, జనవరి 11 (నిజాయితి) :** ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చబోయి ఇద్దరు సర్పంచ్‌లు చిక్కుల్లో పడ్డారు. వీధికుక్కల బెడదను తొలగిస్తామని చెప్పి ఏకంగా 120కి పైగా కుక్కలను అమానుషంగా చంపి పాతిపెట్టారు. జంతు హింస నిరోధక చట్టం ప్రకారం ఇది నేరమని వారిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. హనుమకొండలో వీధికుక్కల ఊచకోత120 కుక్కలను హతమార్చిన సర్పంచ్‌లుకేసు నమోదు చేసిన పోలీసులు సాధారణంగా ఎన్నికల సమయంలో అభ్యర్థులు రకరకాల హామీలు ఇస్తుంటారు. గెలిచిన తర్వాత ఆ హామీలను నెరవేర్చి ప్రజల మెప్పు పొందాలని తపిస్తుంటారు. ఇటీవల సర్పంచ్ ఎన్నికల్లోనూ చాలా మంది అభ్యర్థులు హామీలు ఇచ్చారు. గెలిచాక వాటిని నెరవేర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తాజాగా.. హనుమకొండ జిల్లాలోని ఇద్దరు సర్పంచ్‌లు తాము ఇచ్చిన హామీని నెరవేర్చి చిక్కుల్లో పడ్డారు. పోలీసు కేసులను కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. గ్రామంలోని వీధికుక్కల బెడదను తొలగిస్తామన్న హామీని నెరవేర్చే క్రమంలో వారు ఎంచుకున్న 'కిరాతక మార్గం' ఇప్పుడు వారిని చిక్కుల్లో పడేసింది. హనుమకొండ జిల్లా శాయంపేట, ఆరేపల్లి గ్రామాల్లో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉండేది. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో సర్పంచ్ అభ్యర్థులు హామీ ఇచ్చారు. అయితే గెలిచిన తర్వాత శాస్త్రీయ పద్ధతుల్లో వాటిని నియంత్రించాల్సింది పోయి.. అత్యంత అమానుషంగా 120కి పైగా కుక్కలను చంపి పాతిపెట్టారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ఆరోపణలు రావడంతో అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. 'స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' ప్రతినిధులు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, వెటర్నరీ వైద్యులు గ్రామంలో తవ్వకాలు జరపగా.. పాతిపెట్టిన 120కి పైగా కుక్కల కళేబరాలు లభ్యమయ్యాయి. పశువైద్యులు అక్కడికక్కడే వాటికి పోస్టుమార్టం నిర్వహించి, శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపారు. విషప్రయోగం ద్వారానే ఈ మూగజీవాలను హతమార్చినట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై గ్రామస్తుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కుక్కకాటు వల్ల తాము పడుతున్న ఇబ్బందులు, ఆ కుక్కలకు సోకిన చర్మ వ్యాధుల కారణంగా ప్రబలుతున్న అనారోగ్యాల దృష్ట్యా సర్పంచ్‌ల చర్యను కొందరు సమర్థిస్తున్నారు. అయితే జంతు హింస నిరోధక చట్టం (ప్రాజూ ాావ్, 1960) ప్రకారం వీధికుక్కలను చంపడం తీవ్రమైన నేరం. ఈ నేపథ్యంలో ఇద్దరు సర్పంచ్‌లు సహా మొత్తం 9 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాశంగా మారింది.

## సైబర్ నేరగాళ్ల వలలో వృద్ధ దంపతులు.. రూ.15 కోట్లు కొట్టేశారు..!

**న్యూఢిల్లీ, జనవరి 11 (నిజాయితి) :** సైబర్ నేరగాళ్లు రోజురోజుకీ తెలివిమీరి పోతున్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసులు ఎన్ని విధాలుగా ప్రయత్నించినా.. కొత్త వ్యూహాలు రచిస్తూ.. ఎక్కడో దగ్గర నేరాలు చేస్తూనే ఉన్నారు. ఇటీవల సైబయ్ మాయగాళ్ల వలలో ఇద్దరు వృద్ధ దంపతులు చిక్కుకున్నారు. 17 రోజులు డిజిటల్ అరెస్ట్‌లో ఉండి.. జీవితకాలం దాచుకున్న సుమారు రూ.15 కోట్లు పోగొట్టుకున్నారు. ఢిల్లీలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డా. ఓం తనేజా, ఆయన భార్య డా. ఇందిరా తనేజాలు 48 ఏళ్లు ఐక్యరాజ్యసమితిలో పని చేసి రిటైర్‌మెంట్ తర్వాత 2015లో భారత్‌కు వచ్చారు. గత డిసెంబర్ 24న.. ఆ దంపతులకు పోలీసు అధికారులమంటూ.. సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ వచ్చింది. వారిపై క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయని.. అరెస్టు వారెంట్లతో ఆ దంపతులను బెదిరించారు. డిసెంబర్ 24 నుంచి జనవరి 10 వరకు డిజిటల్ అరెస్టు చేస్తున్నామని.. వీడియో కాల్‌లో హెచ్చరించారు. ఆ సమయంలో ఆ దంపతుల నుంచి రూ. 14.85 కోట్లను కాజేశారు. అనంతరం సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదిస్తే.. ఆర్‌బిఐ ఆదేశాల మేరకు డబ్బు తిరిగి వస్తాయని నమ్మించారు. దీంతో వృద్ధ దంపతులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వారిపై ఎలాంటి అరెస్టు వారెంట్లు లేవని.. సైబర్ మాయగాళ్లు మోసం చేశారని దంపతులు తెలుసుకున్నారు. వారి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## వ్యతిరేక శక్తులను ఓడించడానికి పౌరులంతా ఐక్యంగా ఉండాలి: మోడీ

**గుజరాత్, జనవరి 11 (నిజాయితి) :** శౌర్యానికి పరాక్రమానికి సోమనాథుడు ప్రతీకని ప్రధాని నరేంద్రమోడీ తెలిపారు. ఇది మనకు అద్భుతమైన క్షణాలని అన్నారు. సోమనాథ్ ఆలయంలో మోడీ ప్రత్యేక పూజలు చేశారు. శౌర్య యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడీ ప్రసంగించారు. 1983 ఇండోర్ మహారాణి సోమనాథ మందిరాన్ని పునర్ నిర్మించారని, ఇది కేవలం చరిత్ర కాదు.. మన ధైర్య సాహసాల ఇతి వృత్తం అని కొనియాడారు. ఎన్నో దాడులను సోమనాథ ఆలయం తట్టుకుందని, సోమనాథుడి ఆలయంతో పాటు భారత్ పైనా దండెత్తారని అన్నారు. ఎన్నోసార్లు మందిర స్వరూపాన్ని మార్చేశారని, హత్యలు చేశారని, మహిళలను చెరబట్టారని చెప్పారు. సోమనాథుడిని రక్షించిన యోధులకు వందనాలు తెలియజేశారు. స్వాభిమాన్ పర్వ్ లో పాల్గొనడం అదృష్టం అని ఆనందాన్ని వ్యక్తం చేశారు. సోమనాథ్ ఆలయ పునర్మాణాన్ని వ్యతిరేకించిన శక్తులు ఇప్పటికీ ఉన్నాయని, వ్యతిరేక శక్తులను ఓడించడానికి పౌరులంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. సంపద కోసం ఆలయంపై దాడి జరిగినట్లు తప్పుదోవ పట్టించారని, అనేక సార్లు ఆలయాన్ని ధ్వంసం చేయాలని ప్రయత్నించారని మోడీ పేర్కొన్నారు.ఫౌండేషన్ చైర్మన్ చింతపల్లి శివశంకర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ దార్ల కాశన్న మరియు గ్రామ సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మబుడ్డయ్య మరియు గ్రామ పెద్దలు గ్రామస్తులు ఇతరులు పాల్గొనడం జరిగింది.



సోమవారం
జనవరి 12, 2026
TGTEL/25/A3750 ... నిజమే ...
నిజాయితి
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక



# మహబూబ్‌నగర్ పట్టణానికి స్వర్ణయుగం ప్రారంభం : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి




**మహబూబ్‌నగర్, జనవరి 11 (నిజాయితి) :** మహబూబ్‌నగర్ పట్టణానికి స్వర్ణయుగానికి నాంది పడిందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ అధ్యక్షతన డీసీసీ కార్యాలయంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆశావహులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ అందుతున్నాయని, అందుకే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన ఫలితాలు వచ్చాయని తెలిపారు. గత రెండు సంవత్సరాల కాలంలో మహబూబ్‌నగర్ పట్టణంలో రూ.2000 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. గత పదేళ్లలో మహబూబ్‌నగర్‌ను మున్సిపల్ కార్పొరేషన్‌గా మార్చే అవకాశం ఉన్నప్పటికీ, కొందరి అధికార దాహం కారణంగా పట్టణ అభివృద్ధి నిర్లక్ష్యం చేయబడిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి ని ఒప్పించి మహబూబ్‌నగర్‌ను మున్సిపల్ కార్పొరేషన్‌గా మంజూరు చేయించుకున్నామని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదం, ప్రభుత్వ దృఢ సంకల్పంతో మహబూబ్‌నగర్ పట్టణానికి స్వర్ణయుగం ప్రారంభమైందని చెప్పారు. గత రెండు సంవత్సరాలుగా రూ.100 కోట్లతో పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధి పనులు, రూ.603 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రూ.20 కోట్లతో ఎంవీఎస్ డిగ్రీ కళాశాల నిర్మాణం, రూ.220 కోట్లతో పట్టణానికి శాశ్వత వాటర్ సప్లై పరిష్కారం, రూ.400 కోట్లతో ఐఐఐటీ కళాశాల నిర్మాణం చేపట్టామని వివరించారు. అలాగే రూ.100 కోట్లతో పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు, రూ.17 కోట్లతో పూలేఅంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు, రూ.40 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మరియు హాస్టల్స్ అభివృద్ధి, రూ.200 కోట్లతో సమీకృత పాఠశాలల ఏర్పాటు, రూ.300 కోట్లతో బైపాస్ రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించుకున్నామని తెలిపారు. మైనారిటీ సోదరులు ఎన్నో సంవత్సరాలుగా కోరుకుంటున్న భవనాల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ముఖ్యమంత్రి రూ.45 కోట్లను మంజూరు చేశారని గుర్తు చేశారు. ఈ అభివృద్ధి పనులన్నీ ప్రజల దీర్ఘకాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేపట్టినవని, విద్య, మౌలిక సదుపాయాలు, నీరు, రహదారుల రంగాల్లో మహబూబ్‌నగర్ పట్టణాన్ని ఆధునిక నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 50 డివిజన్లకు మించిన స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తామని ముఖ్యమంత్రికి మాట ఇచ్చామని తెలిపారు. అందుకే టికెట్ ఎవరికి కేటాయించినా నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా టికెట్ పొందిన అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల సంపూర్ణ ఆశీర్వాదంతో అభివృద్ధి ప్రయాణం ఎప్పటికీ ఆగదని, మహబూబ్‌నగర్ పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం నగరంలోని వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, టి పిసిసి అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ఎన్ పి వెంకటేష్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, చలువగాలి రాఘవేందర్, మారే పల్లి సురేందర్ రెడ్డి, సిజె బెనహర్, బురుజు సుధాకర్ రెడ్డి, అలీం, శాంతన్న యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జీ గోనెల శ్రీనివాసులు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలి, నాయకులు ఐఎన్టీయుసి రాములు యాదవ్, మైత్రి యాదయ్య, తఖి, జహీర్, అక్బర్, ఫైసల్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు సామాజిక న్యాయసభ






**మహబూబ్‌నగర్, జనవరి 11 (నిజాయితి) :** పాలమూరు సామాజిక న్యాయసభబీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం (బిసిఐఎఫ్) ఆధ్వర్యంలో 42% రిజర్వేషన్‌కు 9వ షెడ్యూల్ ద్వారా రాజ్యాంగ రక్షణ కల్పించాలి అనే డిమాండ్‌తో పాలమూరు సామాజిక న్యాయ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ హాజరై ప్రసంగించారు. సి. చిరంజీవి గారు రిటైర్డ్ ఐఎఎస్, బిసిఐఎఫ్ వ్యవస్థాపకులు & చైర్మన్‌మెద్దల శ్రీనివాస్ సాగర్ బీసీ సమాజ రాష్ట్ర కార్యదర్శి & ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్‌జస్టిస్ ఈశ్వరయ్య మాజీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తివిశ్వారాధన మహారాజ్ బిసి, ఎస్సి, ఎస్టీ, ఆర్‌ఎమ్ & డిఎఎఫ్సి జెఎసి నాయకులుసంగం సూర్యారావు బీసీ సమాజ నాయకులు & బీసీ టైమ్స్ రాష్ట్ర ప్రతినిధిపాలమూరు వెంకటేశ్ గౌడ్ బీసీ సమాజ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా యువజన అధ్యక్షులుమాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ డీసీసీ ఉపాధ్యక్షులు సత్తూరి చంద్రశేఖర్ గౌడ్ గంజి ఆంజనేయులు (చందు యాదవ్) సహా జిల్లా బీసీ నాయకులుఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి, దానికి రాజ్యాంగబద్ధమైన భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

# ముగిసిన కేజీబీవీ ప్రత్యేక అధికారుల ఐదు రోజులశిక్షణ తరగతులు




**నాగర్‌కర్నూల్, జనవరి 11 (నిజాయితి) :** నీపా ఆధ్వర్యంలో కేజీబీవీ ప్రత్యేక అధికారుల ఐదు రోజుల శిక్షణ తరగతులు ఘనంగా ముగిశాయి, విద్యార్థినిలకు అమ్మలా వ్యవహరించాలి, కేజీబీవీ ప్రత్యేక అధికారులకు ప్రత్యేక సూచన కేజీబీవీల్లో బాలికలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి, ఆర్జెడి యం. సోమిరెడ్డినీపా (జాతీయ విద్యా ప్రణాళిక మరియు పరిపాలనా సంస్థ ఎఐఇపిఎ) ఆధ్వర్యంలో వనపర్తి నాగర్ కర్నూల్ జిల్లాల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ) ప్రత్యేక అధికారుల సాధికారత పై నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ తరగతులు ఆదివారం నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో హైదరాబాద్ ప్రాంతీయ విద్యా సంచాలకులు (ఆర్జెడి) యం. సోమిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేజీబీవీల్లో చదువుతున్న బాలికలను విద్యతో పాటు అన్ని రంగాల్లో తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. బాలికల సమగ్ర అభివృద్ధికి నాణ్యమైన విద్యతో పాటు జీవన నైపుణ్యాలు, క్రీడలు, కళలు, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థినిలకు అమ్మలా వ్యవహరించాలని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుతున్న బాలికలు ప్రత్యేక అధికారులనే తమ రోల్‌మోడల్‌గా భావిస్తారని తెలిపారు. అందువల్ల ప్రత్యేక అధికారులు విద్యార్థినులకు మంచి విద్య, అవసరమైన సౌకర్యాలు కల్పించడమే కాకుండా సత్ప్రవర్తనతో ఆదర్శంగా నిలవాలని సూచించారు. కస్తూరిబాల్లో విద్యాబోధన బాలికలకు అర్థమయ్యేలా, వారి మనసుకు హత్తుకునేలా ఉండాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులతో కంటే విద్యార్థినిలు ఎక్కువ సమయం ఉపాధ్యాయులు, వార్డెన్లతోనే గడుపుతారని, వారు చెప్పే మాటలనే నిజమని నమ్ముతారని అన్నారు. అందువల్ల బాలికల భవిష్యత్తు కేజీబీవీ ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన కేజీబీవీ ప్రత్యేక అధికారుల సామర్థ్యాభివృద్ధి లక్ష్యంగా గత ఐదు రోజులుగా నిర్వహించిన ఈ రెసిడెన్షియల్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తమ తమ కేజీబీవీల్లో అమలు చేసి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని ఆర్జెడి సూచించారు. గత ఐదు రోజుల శిక్షణలో నిర్వహించిన కార్యక్రమాలు, అమలు చేసిన అంశాలను పలువురు ప్రత్యేక అధికారులు, మాస్టర్ ట్రైనర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిసిడిఓ శోభారాణి, వనపర్తి జీసీడీఓ శుభలక్ష్మి, నాగర్‌కర్నూల్ ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు సూర్య చైతన్య, జీసీడీఓ పూలమ్మ (సూర్యాపేట), జీసీడీఓ నర్మద (సిద్దిపేట), పద్మా, సూర్యకళ, అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల కేజీబీవీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహణ అభినందనీయం : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి




**మహబూబ్‌నగర్, జనవరి 11 (నిజాయితి) :** మహబూబ్‌నగర్ నగరంలోని టీచర్స్ కాలనీ పార్క్ సమీపంలో కాంగ్రెస్ పార్టీ 45వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సల్మాన్ షరీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గౌరవ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి వారి ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా కళ్లజోడు అందించడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా పేదలు, వృద్ధులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరాన్ని నిర్వహించిన సల్మాన్ షరీఫ్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజాసేవలో ముందుంటారని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆరోగ్య శిబిరాలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురికి ఎమ్మెల్యే స్వయంగా ఉచితంగా కళ్లజోడు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు


# సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే



**మహబూబ్‌నగర్, జనవరి 11 (నిజాయితి) :** సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే మహబూబ్‌నగర్ నగరంలోని టీడీ గుట్ట ప్రాంతం నుంచి కొత్త చెరువు రోడ్ వరకు ముడా నిధులు రూ. 35 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును గౌరవ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, నగర మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ప్రజల సౌకర్యం కోసం నాణ్యమైన రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సీసీ రోడ్డు ద్వారా స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభమవుతాయని పేర్కొన్నారు. అనంతరం కాలనీ లో పర్యటించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్.పీ. వెంకటేష్, మారెపల్లి సురేందర్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు మునీర్, ఖాజా పాషా, చిన్న, షేక్ ఉమర్, తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

TGTEL/25/A3750 ... నిజమే ...
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

# పోరాటానికి ప్రతీక వడ్డె ఓబన్న: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్‌నగర్, జనవరి 11 (నిజాయితి) :** పోరాటానికి, త్యాగానికి, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు వడ్డే ఓబన్న అని గౌరవ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వడ్డే ఓబన్న 219వ జయంతిని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ నగరంలోని పద్మావతి కాలనీ, గ్రీన్ బెల్ట్‌లో ఉన్న వడ్డే ఓబన్న విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన వీరుడు వడ్డే ఓబన్న అని, పరాయి పాలనకు ఎదురు నిలిచిన ధీరుడని కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం, సమానత్వం మరియు సామాజిక న్యాయం సాధన కోసం జీవితాంతం పోరాడిన యోధుడు వడ్డే ఓబన్న అని పేర్కొన్నారు. అన్యాయం, వివక్షకు వ్యతిరేకంగా ఆయన సాగించిన ఉద్యమం నేటి తరానికి ఆదర్శమని, ప్రజల్లో చైతన్యం రగిలించి హక్కుల కోసం నిలబడే ధైర్యాన్ని నూరిపోసిన మహానుభావుడిగా ఆయన చరిత్ర నిలిచిపోతుందని అన్నారు. వడ్డే ఓబన్న ఆశయాలు, ఆలోచనలు నేటి సమాజానికి అత్యంత అవసరమని, ముఖ్యంగా యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే గారు పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో వడ్డే ఓబన్న జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన చూపిన మార్గంలో నడవడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు ప్రవీణ్ కుమార్, ప్రశాంత్, రఘు, వడ్డెర సంఘం అధ్యక్షుడు పీట్ల యాదయ్య, ఉపాధ్యక్షుడు పీట్ల ఊషన్న, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వడ్డే ఓబన్న 219 వ జయంతి



**గద్వాల, జనవరి 11 (నిజాయితి) :** జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ నియోజకవర్గం ఇటిక్యాల మండలం ఉదండాపురం గ్రామంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు సర్పంచ్ మహేష్ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 219 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేష్ మాట్లాడుతూ...వడ్డే ఓబన్న ధైర్యానికి దిక్సూచి అని అన్నా రు.ప్రతి ఒక్కరూ వడ్డే ఓబన్న గారి ఆశ యాలను, ఆలోచనలను నెరవేర్చేందుకు కృషి చేయాలని అన్నారు.అనంతరం ఉదండాపురం గ్రామానికి నూతనంగా సర్పంచ్ గా మహేష్,ఉపసర్పంచ్ గా యుగేందర్ ఎన్నికైన శుభ సందర్భంగా వడ్డెర కుల సంఘం నాయకులు కలిసి శాలువాతో సన్మానించారు. అలాగే వడ్డే కుల సంఘం నాయకులను సర్పంచ్ మహేష్ శాలువతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యుగేం దర్,జగదీష్,రాజు,వెంకటేష్,కృష్ణ,నరసింహ, రవి, రమేష్,గ్రామ పెద్దలు తదిత రులు పాల్గొన్నారు.

# సంక్రాంతి పండుగకు ఊరేళ్తున్నారా..! ఈ జాగ్రత్తలు పాటించండి.!!

**జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపిఎస్**




**గద్వాల, జనవరి 11 (నిజాయితి) :** సంక్రాంతి పండుగ సందర్భంగా అనేక మంది తమ స్వగ్రామాలకు ప్రయాణాలు చేస్తుంటారు. ఈ సమయంలో ఖాళీగా ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని జిల్లా పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు, ఐపిఎస్., గారు తెలిపారు.సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో చోరీల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, రాత్రి వేళల్లో గస్తీని మరింత పటిష్టం చేశామని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలు కూడా పోలీసులకు సహకరించి భద్రతా చర్యలు పాటించాలని సూచించారు.సంక్రాంతికి ఊరెళ్లే వారికి జోగుళాంబ గద్వాల్ జిల్లా పోలీసుల సూచనలు: జిల్లాలోని కాలనీవాసులు, ఇళ్లు, షాపులు, అపార్టుమెంట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇంట్లో లేని సమయంలో నమ్మకమైన ఇరుగు పొరుగు వారిని ఇంటిని గమనించమని చెప్పాలి. విలువైన వస్తువులను ద్విచక్ర వాహనాల/ కార్ల డిక్కీలలో వదిలి వెళ్లరాదు.వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి, రోడ్లపై నిలపరాదు, బీరువా తాళాలను ఇంట్లో ఉంచకుండా మీతో పాటు తీసుకెళ్లాలి. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాల్లి, గేటుకు తాళం వేసి ఉన్న ఇళ్లలోనే దొంగలు పడే అవకాశం ఎక్కువ ఉంది, ఊర్లకు వెళ్లేవారు ఇంట్లో ఒక గదిలో లైట్ వెలిగించి ఉంచడం మంచిది. ఇంటి ముందు పత్రికలు, పాల ప్యాకెట్లు పేరుకుపోకుండా చూడాలి. పని మనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చమని చెప్పాలి. దీని వల్ల బయట వ్యక్తులకు ఈ ఇంట్లో మనుషులు ఉన్నట్లు కనిపిస్తుంది. విలువైన వస్తువులు, ఆర్థిక విషయాలను ఇతరులతో పంచుకోవద్దు వాహనాలకు హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్ తప్పనిసరిగా వేయాలి. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవడం ఉత్తమం, టైమర్‌తో కూడిన లైట్లను ఇంట్లో అమర్చుకోవచ్చు, ఇంటి ప్రధాన ద్వారానికి సెంట్రల్ లాకింగ్ లేదా నాణ్యమైన సెక్యూరిటీ లాక్ వాడాలి. సీసీ కెమెరాలను ఆన్‌లైన్ లో ఎప్పటికప్పుడు పరిశీలించాలి, డీవీఆర్‌ను రహస్య ప్రదేశంలోఉంచాలి. హోమ్ సెక్యూరిటీ సిస్టం ద్వారా మొబైల్ నుంచే ఇంటిని ప్రత్యక్షంగా చూడవచ్చు. దృఢమైన తలుపులు, నాణ్యమైన గ్రిల్స్‌తో రెండంచెల భద్రత ఏర్పాటు చేసుకోవాలి. కొత్త వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలి. అనుమానితుల కదలికలను వెంటనే పోలీసులకు తెలియజేయాలి. ప్రజలు పోలీస్ గస్తీకి సహకరించాలి, లోకల్ ఎస్ఐ, నంబర్ దగ్గర ఉంచుకోవాల్లి, ఇంటికి తాళం వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. నమ్మకమైన వాచ్‌మెన్ /సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలి. అపార్టుమెంట్లలో కొత్తవారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి. సోషల్ మీడియాలో మీ ప్రయాణ వివరాలు షేర్ చేయకపోవడం మంచిది. దూర ప్రాంతాలకు వెళ్లేవారు మీ చిరునామా, ఫోన్ నంబర్‌ను పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలి. అనుమానాస్పద కదలికలపై డయల్ 100 లేదా మీ సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలి.

# ఘనంగా వడ్డెర ఓబన్న జయంతి



**నాగర్‌కర్నూల్, జనవరి 10 (నిజాయితి) :** ఘనంగా వడ్డెర ఓబన్న జయంతి – గద్వాల జిల్లా కేంద్రంలో కృష్ణారెడ్డి బంగ్లా దగ్గర– జోగులాంబ గద్వాల జిల్లా జనవరి 11 (ఆదివారం): జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కృష్ణారెడ్డి బంగ్లా దగ్గర ఉన్న వడ్డెర వీధి కమిటీ హాల్ లో వడ్డెర ఓబన్న జయంతి 219 వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే కమిటీ సభ్యులు వడ్డెర నరసింహులు మాట్లాడుతూ... వడ్డెర ఓబన్న గారిని ఆదర్శంగా తీసుకొని మన ఆశయాలు లక్ష్యాలను నెరవే ర్చుకొని ముందుకెళ్లాలని వడ్డెర కుల బంధువు లందరికీ ఈ సందర్భంగా తెలియప రిచారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కుల బంధువులందరూ పాల్గొని విజయవంతం చేశారు.

# గద్వాలలో శ్రీ కృష్ణ కాలచక్ర మహా యాగం



**గద్వాల, జనవరి 11 (నిజాయితి) :**
గద్వాల కేంద్రంలో నిర్వహించనున్న శ్రీ కృష్ణ కాలచక్ర మహా యాగం 88వ విశ్వశాంతి మహా యజ్ఞాన్నికి తన వంతు సహాయంగా ఎంపీ డీకే అరుణమ్మ సమక్షంలో శనివారం వివిధ ప్రముఖులు ఇవ్వడం జరిగింది. శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి వారికి 1,00,000/- లక్ష రూపాయలను శ్రీ కృష్ణ జిన్నింగ్ మిల్లు యాజమాన్యం మిర్జాపురం రామచంద్రారెడ్డి, వారి వ్యాపార భాగస్వాములు మల్లెం దొడ్డి వెంకటేశ్వర రెడ్డి, మార్ల బీడు జనార్ధన్ రెడ్డి, మార్లబీడు భాస్కర్ రెడ్డి లు అందించారు. మరియు విశ్వ భారతి విద్యాసంస్థల యాజమాన్యం మాజీ కౌన్సిలర్ పి త్యాగరాజు, పి. తిరుమల్ శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపనంద స్వామివారికి 1,00,000/- లక్ష రూపాయలు స్వామి వారికి అందజేయడం జరిగింది..ఈ సందర్భంగా శ్రీ కృష్ణ జిన్నింగ్ మిల్లు యాజమాన్యం విశ్వ భారతి స్కూల్ యాజమాన్యం మరింత అభివృద్ధి చెందాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడి ఆశీస్సులు కలగాలని భగవంతుని స్వామివారు ప్రార్థించారు.

# ఘనంగా వడ్డె ఓబన్న 219 జయంతి వేడుకలు




**పెంట్లవెల్లి, జనవరి 11 (నిజాయితి) :**
భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యాధ్యక్షుడు, రేనాటి ప్రాంతంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన వీరుడు వడ్డే ఓబన్న 219 జయంతి సందర్భంగా పెంట్లవెల్లి మండలం కేంద్రంలోని ఒడ్డె ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పెంట్లవెల్లి సర్పంచ్ చిట్టెమ్మసురేందర్ గౌడ్,పెంట్లవెల్లి బిఆర్ఎస్ పార్టీ మం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవు రాజు మాట్లాడుతూ కర్నూలు జిల్లా రేనాటిలో జన్మించిన ఓబన్న వడ్డెర కులానికి చెందినవారు, సంచార జాతుల సైన్యాన్ని నడిపించి, నల్లమల అడవుల్లో బ్రిటిష్ సైన్యంని ఎదుర్కొన వీరుడు అని కొనియాడారు.నాయకత్వం వ్యూహాలు భయం ఎరుగని వడ్డెర్లు, బోయలు, చెంచులతో కూడిన వేలాది మంది సైన్యాన్ని నల్లమల అడవుల్లో సమర్థవంతంగా నడిపించి, బ్రిటిష్ సైన్యాన్ని ఎదుర్కొని, వారిని పదే పదే ఓడించారు.ఒడ్డె ఓబన్న సుమారు 39 ఏళ్ల వయసులో జగన్నాథకొండ వద్ద బ్రిటిష్ వారి చేతిలో వీరమరణం పొందారన్నారు.ఈ కార్యక్రమంలో 13 వార్డు మెంబెర్ కొత్తపేట కురుమూర్తి, 10వార్డు మెంబెర్ ఖలీల్, 6వార్డు బత్తిని రాజు, 5వార్డు మెంబెర్ తుపాకుల సురేష్, బీజేపీ నాయకులు ద్యారంగుల విష్ణు, అలకుంట రాజు తదితరులు పాల్గొన్నారు.

# కోడేరులో రైతు సంబరాలు




**కోడేరు, జనవరి 11 (నిజాయితి) :**
కోడేరు మండల కేంద్రంలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 16 జనవరి 2026 నాడు జరుగు రైతు సంబరాల అంతర్రాష్ట్ర బండలాగుడా పోటీల సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురభి చలపతిరావు గ్రౌండ్‌ను సందర్శించడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి సురభి చలపతిరావు ఆర్గనైజర్స్ కు సూచనలు ఇవ్వడం జరిగింది. వచ్చిన ఎద్దులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, మరియు ప్రజలకు మంచినీళ్లు అందుబాటులో ఉండే విధంగా చొరవ తీసుకోవాలని మరియు గ్రౌండ్ ను శుభ్రంగా చేసి అందరికీ అనుకూలంగా ఉండేటట్లు తీసుకోవాలని ఆర్గనైజర్లకు సూచించడం జరిగింది. సురభి చలపతిరావు తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# సంస్కృతి,సాంప్రదాయాలకు చిహ్నాం సంక్రాంతి పండుగ.

## - మాజీ ఎం.పి రావుల చంద్రశేఖర్ రెడ్డి




**వనపర్తి, జనవరి 11 (నిజాయితి) :**
కౌన్సిలర్ భారతి ప్రేమ్ నాథ్ రెడ్డి ఆధ్వర్యములో 29వార్డు అమ్మ వారి పార్క్ లో నిర్వహించిన ముగ్గుల పోటీలలో మాజీ ఎం.పి, బి.ఆర్.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందించి నిర్వాహకులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా రావుల మాట్లాడుతూ సంక్రాంతి పండుగ మన సంస్కృతి, సాంప్రదాయాలకు చిహ్నంగా నిలుస్తుందని ఆదివారం పెద్దఎత్తున ముగ్గుల పోటీలలో పాల్గొని ప్రస్తుతం సమాజములో ఆవిష్కరింపబడుతున్న అంశాలను మహిళలు చూపారని అభినందించారు. గంగిరెద్దుల విన్యాసాలను వీక్షించి బాలబాలికలకు పతంగులు అందించి సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. కనుమరుగు అవుతున్న సంప్రదాయాలను వెలుగులోకి తెచ్చిన నిర్వాహకులను సన్మానించి అభినందించారు. మొదటి బహుమతి విజేత శివమ్మ, రెండవ విజేత సిరి,మూడవ విజేత సుజాతలకు నిర్వాహకులు ఇచ్చిన బహుమతులు 10వేలు,5వేలు,2500లతో పాటు రావుల ప్రత్యేకంగా కుంకుమ భరణిలు బహుకరించారు. ఈ కార్యక్రమములో జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్,మాజీ కౌన్సిలర్ భారతి ప్రేమ్ నాథ్ రెడ్డి,నిర్వాహకులు కె.రమేష్ చంద్ర, సత్యనారాయణ రెడ్డి,మారం. బాలేశ్వరయ్య,రామచంద్రారెడ్డి,పలుస.శంకర్ గౌడ్, బైరోజు.చంద్రశేఖర్, చీర్ల రాజేందర్ నాయకులు ఎం.డి. గౌస్, నందిమల్ల. రమేష్, సయ్యద్, జమీల్, కిషోర్ కుమార్ రెడ్డి, అమరేందర్, బాలు నాయుడు, ఖాదర్, వహీద్, ముద్దసార్

సోమవారం
జనవరి 12, 2026
TGTEL/25/A3750 ... నిజమే ...
నిజాయితి
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక



# అసలు ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది ఎవరు? : హరీష్ రావు



**హైదరాబాద్, జనవరి 11 (నిజాయితి) :** టికెట్ల పెంపు విషయంలో హైకోర్టు మొట్టికాయలు వేసినా.. ఈ ప్రభుత్వం తీరు మారకపోవడం శోచనీయం అని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఒక వైపు అసెంబ్లీ సాక్షిగా సొంత డబ్బా.. మరొక వైపు క్షేత్రస్థాయిలో అడ్డగోలు నిర్ణయాలని, చెప్పేదొకటి, చేసేది మరొకటి.. పేపర్లలో కలరింగ్ ఇచ్చేది ఇంకొకటి అని విమర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. సిఎం రేవంత్ రెడ్డి అసలు మీరు నడుపుతున్నది సర్కారా.. లేక సర్కస్ కంపెనీనా..అని అసెంబ్లీ వేదికగా ఏమని ప్రగల్భాలు పలికారు? అని ప్రశ్నించారు. తను ఈ సీట్లో ఉన్నంత కాలం సినిమా టికెట్ రేట్ల పెంపు ఉండదని బెనిఫిట్ షోలు ఉండవని ఎవరికీ స్పెషల్ ప్రివిలేజ్ ఇవ్వం అని మైకు పట్టుకొని ఊదరగొట్టినావని చురకలంటించారు.మరి ఇప్పుడు రాత్రికి రాత్రే జీవోలు ఎట్లా వచ్చాయని.. ఇప్పటికే మూడు సినిమాలకు అడ్డగోలుగా రేట్లు పెంచుతూ జీవోలు ఇచ్చారని మండిపడ్డారు. అసెంబ్లీలో అబద్ధాలు ఆడటం మీకు వెన్నతో పెట్టిన విద్య అనీ మాకు తెలుసు.. కానీ సినిమా టికెట్ల విషయంలో కూడా ఇంత నిస్సిగ్గుగా సభను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తారా అని ప్రశ్నించారు. ఇక సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిస్థితి చూస్తే జాలేస్తోందని, ఒక పక్క హోం శాఖ జీవో ఇస్తుందని.. మరోవైపు.. సినిమా మంత్రి ఏమో నాకు సంబంధం లేదని, నా దగ్గరికి ఎవరూ రాలేదు అంటారని.. ఆ శాఖకు బాధ్యత వహించాల్సిన సినిమాటోగ్రఫీ మంత్రి గారేమో.. నాకు తెలియదు.. నా ప్రమేయం లేదు.. నా దగ్గరికి ఫైల్ రాలేదు అని నిస్సహాయంగా చేతులెత్తేస్తారని ధ్వజమెత్తారు. ఐటీ మంత్రిని నేనే సివిల్ ఏవియేషన్ మంత్రిని నేనే అని ఈ మధ్య చెప్పుకున్న కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఇపుడు ఉన్న శాఖ తో తనకు సంబంధం లేదని ఎందుకు అంటున్నారు? అని టిక్కెట్ల రేటు పెంపు సిఎం నిర్ణయమేనని కోమటి రెడ్డి చెప్పకనే చెపుతున్నారని, అంటే, తెలంగాణలో సినిమా శాఖకు మంత్రి ఉన్నట్టా..లేనట్టా.. అని హరీశ్ రావు నిలదీశారు. సంబంధిత శాఖ మంత్రికి తెలియకుండానే జీవోలు విడుదల అవుతున్నాయంటే.. ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది ఎవరు..అని తెర వెనుక ఏ రాజ్యాంగేతర శక్తి ఉంది అని ప్రశ్నించారు. ఒక సినిమా రిలీజ్ సమయంలో దుర్ఘటన జరిగినప్పుడు నీతులు చెప్పారని.. ఇప్పుడేమో యథేచ్ఛగా రేట్లు పెంచుతున్నారని మంత్రికి తెలియకుండా పాలన సాగడమేనా మీ ప్రజా పాలన అని ..ధ్వజమెత్తారు.అసలు సినిమా రంగాన్ని ఒక పరిశ్రమగా చూస్తున్నారా? లేక మీ రాజకీయ కక్షలు తీర్చుకునే అడ్డాగా మార్చుకున్నారా? ప్రశ్నించారు. పాలకుడు అనేవాడు పాలసీ తో ఉండాలి తప్ప, పగతో ఉండకూడదని అన్నారు. గత పదేళ్లు మాజీ సిఎం కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సినిమా పరిశ్రమను కంటికి రెప్పలా కాపాడుకున్నారని, ఎక్కడా వివక్ష చూపలేదని అందుకే ఇవాళ తెలుగు సినిమా ఆస్కార్ స్థాయికి ఎదిగిందని కొనియాడారు. ప్రపంచం గర్వించేలా మన సినిమాలు తయారవుతున్నాయని, 50, 60 ఏళ్లుగా ఎంతోమంది కష్టపడి నిర్మించుకున్న ఈ పరిశ్రమ వాతావరణాన్ని.. మీ అహంకారంతో, మీ పిచ్చి చేష్టలతో, మీ పగ ప్రతీకారాలతో, మీ చిల్లర రాజకీయాలతో నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వమంటే అందరినీ సమానంగా చూడాలని, ఒకరికి చుట్టం .. మరొకరికి శత్రుత్వం ఉండకూడదని హితవు పలికారు. సినిమా వాళ్లను కూడా మీ రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటు అని ఇది ప్రజా పాలన కాదని.. ఇది మీ పాపిష్టి పాలన కు పరాకాష్ట అని సూచించారు. ఎన్నికల్లో ఓడిపోయి.. నేడు రాజ్యాంగేతర శక్తిగా ఎదిగి సినిమా టికెట్ల రేట్లను శాసిస్తున్న ఆ కనిపించని శక్తి ఎవరో? ఒక్కో సినిమాకు కమిషన్ల రూపంలో ఎన్ని కోట్లు వసూలు చేస్తున్నారో?.. ఆ వివరాలన్నీ త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. సాక్షాత్తు ఒక క్యాబినెట్ మంత్రికి తెలియకుండానే.. ఆయన శాఖలో ఇంత పెద్ద నిర్ణయం జరిగిపోతుంటే.. అసలు ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది ఎవరు.. అని ప్రశ్నించారు. శాఖ ఒకరిది.. పెత్తనం మరొకరిది.. జివో ఇచ్చేది ఇంకొకరు.. అని హరీశ్ రావు దుయ్యబట్టారు.

# సికింద్రాబాద్ అస్తిత్వాన్ని దెబ్బకొట్టే కుట్ర జరుగుతోంది: తలసాని



**హైదరాబాద్, జనవరి 10 (నిజాయితి) :** సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం ఉద్యమం తీవ్రతరం చేస్తామని బిఆర్ఎస్ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. డీలిమిటేషన్ పేరుతో సికింద్రాబాద్ ను ముక్కలు చేస్తే సహించేది లేదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సికింద్రాబాద్ కార్పొరేషన్ తో పాటు సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలని, ఈ నెల 17న నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలని నిర్ణయించామని తలసాని పేర్కొన్నారు. సికింద్రాబాద్ లో రైల్ రోకో, బంద్ లు నిర్వహిస్తామని, నిరవధిక దీక్షలు, అవసరమైతే ఆమరణ దీక్ష చేస్తామని అన్నారు. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని దెబ్బకొట్టే కుట్ర జరుగుతోందని, జిహెచ్ ఎంసి డివిజన్ల పునర్విభజన తప్పుల తడకగా ఉందని విమర్శించారు. మేయర్ కు కూడా తెలియకుండా పునర్విభజన చేశారని తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు.

# అమరావతి అంశంలో వివాదాలు పెట్టుకోవద్దు : వెంకయ్యనాయుడు



**హైదరాబాద్, జనవరి 11 (నిజాయితి) :** రాజకీయాల్లో వారసత్వాన్ని ప్రోత్సహించడం తనకు నచ్చదని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు గుర్తుచేయాలని అన్నారు. రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్ లోని స్వర్ణభారత్ ట్రస్ట్ లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో వెంకయ్య నాయుడు పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.. భవిష్యత్తు బాగుండాలంటే ప్రకృతితో కలిసి జీవించాలని, మన పండుగలన్నీ ప్రకృతితోనే ముడిపడి ఉన్నాయని తెలియజేశారు. స్వర్ణభారత్ ట్రస్ట్ నే తమ అమ్మాయికి వారసత్వంగా ఇస్తున్నానని, స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా సుమారు లక్షమందికి పైగా ఉచితంగానే భోజనం, వసతి కల్పించి శిక్షణ ఇస్తున్నామని అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు మరచిపోకూడదనే ఏటా స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పండుగలు నిర్వహిస్తున్నామని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.కేంద్రం, రాష్ట్రం అందరం కలిసి రాజధానిగా అమరావతిని ఏర్పాటు చేసుకున్నామని, అమరావతి అంటే గుంటూరు, గన్నవరం, విజయవాడ, తాడికొండ అని అన్నారు. అమరావతి ఒక రూపురేఖలు దిద్దుకుంటుందని, అమరావతి పూర్తిగా అభివృద్ధి చెంది.. మంచి పేరులోకి వస్తోందని భావిస్తున్నానని చెప్పారు. సిఎం చంద్రబాబు నాయుడు చర్యలకు కేంద్రం పూర్తిగా సహకరిస్తోందని, అందరూ కలిసి అమరావతిని అద్భుతంగా తయారు చేస్తారనే నమ్మకం ఉందని అన్నారు. అమరావతి అంశంలో తెలుగువాళ్లు అనవసర వివాదాలు పెట్టుకోవద్దు అని.. కోరారు. అన్ని ప్రాంతాలకు మధ్యలో అమరావతి ఉంటుందని, హైదరాబాద్ తరహాలోనే.. అమరావతిని అభివృద్ధి చేసుకోవాలని వెంకయ్యనాయుడు సూచించారు.

# ఎవరి అండ చూసుకుని గూండా వెంకటేష్ దాడులు చేస్తున్నాడు: ఈటెల



**మల్కాజ్‌గిరి జనవరి 11 (నిజాయితి) :** ఏకశిల రియల్ ఎస్టేట్ గూండా వెంకటేష్ భరతం పడతామని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ హెచ్చరించారు. ఈ ప్రాంత ఎంపిగా ఉన్న తానే స్వయంగా హెచ్చరించినా గూండాలు బరితెగిస్తున్నారని మండిపడ్డారు. ఏకశిలా నగర్ లో ఈటెల పర్యటించి ప్లాట్ల యజమానులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడారు. రియల్టర్ వెంకటేష్ ఎవరి అండ చూసుకుని ప్లాట్స్ యజమానులపై దాడులు చేస్తున్నారని దుయ్యబట్టారు 24 గంటల్లో నేరస్తులను పోలీసులు అరెస్ట్ చేయాలని ఈటెల డిమాండ్ చేశారు. లేకపోతే ప్లాట్ల యజమానులతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని, భూ మాఫియా గుండాల ఆగడాలు రోజు రోజుకు మితిమీరి పోతున్నాయని మండిపడ్డారు.సిఎం రేవంత్ రెడ్డి పాలనలో భూ మాఫియా రౌడీలు బహిరంగంగా ప్రజల ప్రాణాలు తీయడానికి కత్తులతో విచక్షణా రహితంగా దాడులు చేస్తున్నారని, పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని, భూ మాఫియాకు రేవంత్ ప్రభుత్వం కొమ్ము కాస్తూ ప్రజల ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారుల పనితీరుకు, చేతకానితనానికి పరాకాష్ట ఏకశిలా నగర్ లో జరిగిన దాడి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయంగా ఒక ఎంపి ఏకశిలా నగర్ లో జరుగుతున్న గుండాల అరాచకాలను బయటపెట్టినా.. అధికారులను, ప్రభుత్వాన్ని హెచ్చరించిన తర్వాత కూడా స్పందించకపోవడం దురదృష్టకరమైన విషయమన్నారు. ఈ ఘటనను ఊరికే వదిలిపెట్టమని, ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడేలా మా కార్యాచరణ ఉంటుందని, బాధితులకు అండగా ఉంటామని, న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగుతుందని, మరోసారి ఇలాంటి ఘటనలు జరిగితే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈటెల హెచ్చరించారు.ఏకశిలా వెంచర్‌లో ప్లాట్ల వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఎడి సర్వే కోసం వచ్చిన అధికారులను ఏకశిలా ప్లాట్ ఓవర్ అసోసియేషన్ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో హర్ష కన్‌స్ట్రక్షన్ యజమాని వెంకటేశ్ అనుచరులు, ప్లాట్ల యజమానుల మధ్య గొడవ తారాస్థాయికి చేరుకుంది. పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించడానికి ప్రయత్నించారు. పోలీసుల ఎదుటే వెంకటేశ్ అనుచరులు రాడ్లు తీసుకొని ప్లాట్ల యజమానులు తలలు పగులగొట్టారు. నలుగురు యువకులు తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. ప్లాట్ల యజమానులు మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# మనం చేసిన అభివృద్ధియే మనకు శ్రీరామరక్ష..... మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, జనవరి 11 (నిజాయితి) :** పట్టణములో మనం చేసిన అభివృద్ధి మనకు శ్రీ రామరక్ష గా ఉండి మనని గెలిపిస్తుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం లో భాగంగా ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ,మాజీ ఎంపీ రావుల.చంద్రశేఖర్ రెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ నాయకులు మనం చేపట్టిన రోడ్ల విస్తరణ, పార్కుల సుందరీకరణ, చెరువుల దురస్తూతో ఏర్పాటు చేసుకున్న ట్యాంక్ బండ్లు, జిల్లా కలెక్టరేట్,మాత శిశు సంక్షేమ కేంద్రం, సుందరమైన అంతర్గత సి.సి రోడ్లు, నిత్యం మంచినీటి సరఫరా, టౌన్ హాల్, సమీకృత మార్కెట్, తదితర పనులు ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని పిలుపునిచ్చారు. రెండేండ్లలో పాలన విధ్వంసాన్ని ప్రజలకు వివరించాలని అన్నారు. మళ్ళీ మనకు అవకాశం పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీ ఇవ్వాలని అన్నారు. ఆశావాహులు ఎందరున్నా కార్యకర్తల ఏకాభిప్రాయంతోనే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని ఐకమత్యంతో పని చేసి మున్సిపల్ ఎన్నికలో గులాబీ జెండా ఎగురవేసి పార్టీ ప్రతిష్ఠ పెంచాలని అన్నారు. పార్టీ గెలుపు కోసం శ్రమించే నాయకులను పార్టీ గుర్తిస్తుంది.... మాజీ ఎం.పి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల.చంద్రశేఖర్ రెడ్డి .మున్సిపల్ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎం.పి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖరరెడ్డి పిలుపు నిచ్చారు. పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరు గ్యారంటీలు,420హామీలు అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతుందని అన్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హయంలో పట్టణాభివృద్ధి పరుగులు పెట్టిందని మన అభివృద్ధి మనల్ని గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలలో మంచిపేరు,సేవాభావం కలిగిన అభ్యర్థులను నిర్ణయిద్దామన్నారు. అవకాశం రాని నాయకులకు భవిష్యత్తులో పార్టీ గుర్తించి పదవులు ఇస్తుందని ఎవ్వరూ కూడా నిరాశ చెందవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశములో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,కురుమూర్తి యాదవ్, గంధం బాలపేరు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా కూడార్రై ఉత్సవం

**వనపర్తి, జనవరి 11 (నిజాయితి) :** పవిత్ర ధనుర్మాసోత్సవాలలో భాగంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం గోవింద క్షేత్రం నందు వైష్ణవ సాంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత గల కూడార్రై ఉత్సవం ఆదివారం నాడు వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకులు శ్రీకాంత్ ఆచార్యులు ఆధ్వర్యంలో కూడార్రై ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గోదా అమ్మవారి కృపాకటాక్షాలను అందుకున్నారు ఉత్సవాన్ని ఆలయ అధ్యక్షులు తీగల సునీంద్ర మరియు సభ్యులు పెద్ద పులి సుధీర్ ప్రశాంత్ రెడ్డి బాలకృష్ణ శేఖర్ రెడ్డి దశరథం లక్ష్మీ నరసింహ గౌడ్ చంద్రమోహన్ రెడ్డి చిగుళ్లపల్లి శ్రీనివాసులు రమణ మరియు సభ్యులు పాల్గొన్నారు





# మున్ననూర్ గ్రామాన్ని జిల్లాకే ఆదర్శంగా తీర్చిదిద్దుదాం...

**వనపర్తి, జనవరి 11 (నిజాయితి) :** గ్రామాల్లో ప్రతి ఒక్కరు పార్టీలకతీతంగా పనిచేస్తే గ్రామం త్వరితగతిన సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని ఇటీవల గ్రామాలలో గెలుపొందిన సర్పంచులు, వార్డు సభ్యులందరూ ఓటు వేసిన వేయకుండా గ్రామస్తులందరూ మనవారేనని ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి తోడ్పడాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం గోపాల్పేట మండలం మున్ననూరు గ్రామంలో నిర్వహించిన మార్నింగ్ వాక్ లో ఆయన అన్ని శాఖల అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించి గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలోని వీధుల గుండా పర్యటించి గ్రామ ప్రజలతో మాట్లాడి పలు సమస్యలను అక్కడే అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కారం చేయాలంటూ సూచించారు. గ్రామంలో విద్యాభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతి ఒక్కరూ పాఠశాలను బలోపేతం చేసుకునేందుకు కృషి చేయాలి అన్నారు ఇందుకుగాను గ్రామంలో పాఠశాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వం తరఫున కోటి రూపాయలను మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాలలో నెలకొనే సమస్యలన్నీ తనకు తెలుసునని గ్రామ సర్పంచ్ పదవి దగ్గర నుంచి ఎంపీటీసీ ఎంపీపీ ప్రస్తుతం ఎమ్మెల్యేగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తన సొంత గ్రామం మంగంపల్లిలో పూర్తి అభివృద్ధి సాధించామని తన సొంత గ్రామం లాగానే మున్ననూరు గ్రామాన్ని సైతం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించేలా తను కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్ననూర్ గ్రామ ఎంప్లాయిస్ వెల్ఫేర్



అసోసియేషన్ సభ్యులు, గ్రామ సర్పంచ్ మమత, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప, గోపాల్పేట ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ సత్య శీలా రెడ్డి, మండల మత్స్య సహకార సంఘం అధ్యక్షులు సత్యం, గ్రామ అధ్యక్షుడు ధీర మల్లు, యూత్ అధ్యక్షులు శశికుమార్, గ్రామ పెద్దలు గ్రామస్తులు గ్రామ మహిళలు యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. రెండేళ్లలో వనపర్తి పట్టణాభివృద్ధికి రూ. 897 కోట్ల రూపాయల మంజూరు .....కేవలం రెండు సంవత్సరాల లోనే వనపర్తి పట్టణ అభివృద్ధికై రాష్ట్రంలోని రేవంత్ సర్కార్ రూ. 807 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి రెండు కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరయ్యాయని ఇందుకు సంబంధించి పట్టణంలో అధునాతన వీధి దీపాల ఏర్పాటుకు సంబంధించి 60 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం వీధిదీపాలు ఏర్పాటు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. దినదిన అభివృద్ధి చెందుతున్న వనపర్తి పట్టణాన్ని రాష్ట్రంలోనే గుర్తింపు పొందేలా చేయడమే తన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. పెబ్బేరు మున్సిపాలిటీకి సైతం ఒక రూ.కోటి 23 లక్షల రూపాయలు మంజూరయ్యాయని ఇందులో 20 లక్షల రూపాయలను వీధి దీపాల ఏర్పాటుకు కేటాయించి నేడు వీధిదీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఈ భాస్కర్, మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రాంచందర్‌రావు వ్యాఖ్యలపై స్పందించిన జనసేన




**హైదరాబాద్, జనవరి 11 (నిజాయితి) :** తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వ్యాఖ్యలపై తెలంగాణ జనసేన స్పందించింది. పొత్తులపై జాతీయ స్థాయిలో జనసేన అధినేత, ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ దే నిర్ణయమని తెలంగాణ జనసేన ఇన్‌ఛార్జ్ శంకర్‌గౌడ్ తెలిపారు. బిజెపితో పొత్తు ఉంటుందా లేదా అనేది పవన్ నిర్ణయని తెలియజేశారు. పొత్తు ఉన్నా లేకపోయినా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తామని స్పష్టం చేశారు. బలమున్న స్థానాల్లో తప్పకుండా బరిలో ఉంటామని చెప్పారు. మా టార్గెట్ 2028 అసెంబ్లీ ఎన్నికలేనని శంకర్‌గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ ఒంటరిగా పోటీ చేస్తామని రాంచందర్ రావు తెలిపిన విషయం తెలిసిందే. అసెంబ్లీకి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధకారంలోకి రాబోతున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

# అమరావతి అభివృద్ధి చెందకూడదనే జగన్ ఉద్దేశం: యనమల



**అమరావతి, జనవరి 11 (నిజాయితి) :** రాజ్యాంగంలో క్యాపిటల్ పదం లేదనడం..అవగాహనరాహిత్యానికి నిదర్శనమని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు చురకలంటించారు. అమరావతిపై అసంబద్ధ ప్రకటనతో మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవ్వులపాలవుతున్నారని విమర్శించారు. రాజధానిపై వేర్వేరు మాటలు చెప్పడం.. గందరగోళాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలోని అనేక రాజధానుల నదీతీరాలు పక్కనే ఉన్నాయని, అమరావతి అభివృద్ధి చెందకూడదనే ఉద్దేశంతో జగన్ వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదనే జగన్ లక్ష్యమని తెలుస్తోందని యనమల రామకృష్ణుడు దుయ్యబట్టారు.

# ఆదాయం మిన్న అభివృద్ధి సున్నా -అయిజ బస్టాండ్ దుస్థితి.

**అయిజ, జనవరి 11 (నిజాయితి) :** జోగులాంబ గద్వాల జిల్లా ఆయిజ మునిసిపాలిటీ జిల్లాలోనే రెండవ పెద్ద మున్సిపాలిటీ. మూడు రాష్ట్రాలకు(కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ) కేంద్ర బిందువుగా ఉన్నదని, 100 గ్రామాలకు పైగా వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతున్నది పేరున్నది. రోజుకు వందల బస్సులు పైగానే తిరుగుతున్నా, లక్షల పైగానే ఆదాయం వస్తున్నా అభివృద్ధి మాత్రం శూన్యమని ప్రజలు అనుకుంటున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు బస్టాండ్ ప్రాగణమంతా చెరువును తలపిస్తుందని, వర్షం వచ్చిందంటే ప్రయాణికులు నిలబడడానికి కూడా స్థలం ఉండదని ప్రజలనుకుంటున్నారు. ఎప్పుడో సుమారు 35 ఏళ్ల క్రితం అప్పటి జనాభాను దృష్టిలో ఉంచుకొని నిర్మించిన ప్రాంగణం. ఇప్పుడు చాలడం లేదని జనాభా పెరుగుతున్న కొద్దీ ప్రయాణం సౌకర్యాలు కూడా పెరుగుతున్నాయి. బస్సులకు ప్లాట్ఫారం లేక ఎగుడు దిగుడు ప్లాట్ఫారంతో బస్సులో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, ఇంత ఆదాయం వస్తున్న బస్టాండ్ గురించి పట్టించుకునే నాథుడు లేదని ప్రయాణికులు వాపోతున్నారు. మూడు రాష్ట్రాలకు మధ్య కేంద్రంగా ఉన్న అయిజ బస్టాండ్ దుస్థితి ఇది. దీనికి తోడు బస్సులే ఇబ్బంది పడుతుశీటే బస్సు ప్రాంగణం ముఖద్వారాం దగ్గర ప్రైవేట్ వాహనాలు, ఆటోలు, జీపుల జోరు అడ్డగోలుగా నిలపడం వల్ల బస్సు రాకపోకులకు ఇబ్బందులు కలుగుతున్నాయని,ఎన్నో ప్రమాదాలు కూడా సంభవించాయని అనుకుంటున్నారు. ఇంత జరుగుతున్న అధికార





యంత్రాంగం నిమ్మకు నిరేత్తినట్టుగా వ్యవహరించడం శోచనీయంగా ఉందని అనుకుంటున్నారు. ఆదాయం ఉన్నా పల్లెలకు గానీ పట్టణాలకు గాని ఆరకొర బస్సులతోనే నెట్టుకొస్తున్నదని, బస్సుల సౌకర్యం పెంచాలని ప్రయాణికులు అనుకుంటున్నారు. బస్సు వచ్చిందంటే చాలు సీట్ల కోసం ముందు వెనుక చూసుకోకుండా కుస్తీ కోసం పోటీ పడుతున్నట్టుగా ఎగబడుతున్నారు. దీనికి కారణం అరకొర బస్సుల సౌకర్యమేనని, ఆదాయంను బట్టి బస్సులు సౌకర్యాలు పెంచితే బాగుంటుందని, ఆదాయం కూడా పెరుగుతుందని ప్రయాణికులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు .ఎంతో మంది నాయకులు, పాలకులు తమ రాజకీయ స్వలాభాల కొరకు అయిజను వాడుకున్నారు కానీ బస్టాండ్ గూర్చి ఆలోచించక పోవడం శోచనీయమని అయిజ వాసులు ఆవేదన చెందుతున్నారు. ఏది ఏమైనా అభివృద్ధి చెందుతున్న అయిజకు నూతన బస్సు ప్రాంగణం నిర్మిస్తే అయిజ అభివృద్ధి చెందుతుందని ఆర్టీసీకి ఆదాయం పెరుగుతుందని పట్టణ వాసులు అనుకుంటున్నారు.

**అరకొర సౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నాము.... రాజరత్నం, అయిజ మున్సిపాలిటీ** అయిజ దాదాపు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన బస్టాండ్ అరకొర సౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నాము. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎంత మంది పాలకులు మారినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అనే విదంగా ఉన్నది. ప్రస్తుత ప్రభుత్వమైనా నూతన భవనానికి మంజూరి చేస్తే భాగుంటుందని అన్నారు.

# జూనియర్ డాక్టర్ లావణ్యా ఆత్మహత్యకు కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

## ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ డిమాండ్



**అలంపూర్, జనవరి 11 (నిజాయితి) :** దళిత నిరుపేద కుటుంబానికి చెందిన లావణ్య తొలి ప్రయత్నం లోనే నీట్ లో ఉత్తమ ర్యాంకును సాధించి సిద్దిపేట మెడికల్ కాలేజీలోఎంబీబీఎస్ లో చేరి నాలుగున్నర ఏళ్లు పూర్తిచేసి అక్కడే హౌస్ సర్జన్ గా ఇంటర్నషిప్ చేస్తున్న దళిత అమ్మాయి లావణ్యను అక్కడే సీనియర్ రెసిడెంట్ గా విధులు నిర్వహిస్తున్న ప్రణయ్ తేజ్ మోసపూరితమైన ప్రేమ పేరుతో వంచించి కులం సాకుతో తను ఆత్మహత్య చేసుకునేలా చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం గద్వాల జిల్లా మానవపాడు మండలం జల్లాపురం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. డాక్టర్ లావణ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దళిత బిడ్డ ఆత్మహత్య చేసుకుని వారం రోజులు అవుతున్న నేటి వరకు అధికార పాలకులు, స్థానిక ఎమ్మెల్యే విజయుడు స్పందించకపోవడం దారుణం అన్నారు. నిందితుడిని జైల్లోనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ప్రణయ్ తేజ్ ఫోటోతోపాటు వారి కుటుంబ సభ్యులను కూడా మీడియాలో పేపర్లో ప్రచురించాలని అలా చేయడం ద్వారా మరో నిరుపేద కుటుంబానికి అన్యాయం జరగకుండా ప్రతి బిడ్డ జాగ్రత్త పడతారన్నారు. నిందితుడుకు బెయిల్ ఇవ్వకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లావణ్య కుటుంబానికి అండగా ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొంకల భీమన్న,మస్తాన్ ,శీను, జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

**50 లక్షల ఎక్స్గ్రేషియా ఉద్యోగం కల్పించాలి.**

బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్ మహరాజ్ జూనియర్ డాక్టర్ లావణ్య మృతికి కారణమైన ప్రణయ్ తేజను కఠినంగా శిక్షించాలని అంతేకాక మృతురాలి కుటుంబానికి 50 లక్షల ఎక్స్గ్రేషియా , కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్ మహరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం జల్లాపురం గ్రామం చేరుకొని లావణ్య కుటుంబాన్ని పరామర్శించారు.

# ఉప్పల్ లో చైనా మాంజాతో తెగిన మెడ



**ఉప్పల్, జనవరి 11 (నిజాయితి) :**
మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఉప్పల్ లో చైనా మాంజాతో మరొకరి మెడ తెగింది. ఉప్పల్ స్టేడియం మెట్రో స్టేషన్ సమీపంలో బైక్ వెళ్తున్న సాఫ్ట్ వేర్ ఇంజినీర్ సాయి వర్ధన్ రెడ్డి చైనా మాంజా తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మెడపై లోతైన గాయం కావడంతో వెంటనే స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మాంజా సమాచారం పోలీసులకు తెలియజేయాలని ఉప్పల్ పోలీసులు సూచిస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలోని అంబర్ పేటలోని కొత్త ఫ్లైఓవర్ పై చైనా మాంజా తగలడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. కీసరలో మరో వ్యక్తి చైనా మాంజా మెడకు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఓల్డ్ మిర్జాల్‌గూడలో మాంజాను లాగడంతో 33 కెవి కరెంట్ తీగ తెగింది. మాంజాలకు చిక్కుకొని పావురాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. పావురాల బాధ అరణ్యరోదనగా మారింది.

# లాల్ బహుదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

## - ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి, జనవరి 11 (నిజాయితి) :** స్వాతంత్ర సమరయోధుడు తెల్ల విప్లవాన్ని ప్రారంభించి హరిత విప్లవానికి శ్రీకారం చుట్టిన నిరాడంబరడైన నాయకుడు లాల్ బహుదూర్ శాస్త్రి అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా వనపర్తి పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరాబరుడైన లాల్ బహుదూర్ శాస్త్రి స్వాతంత్ర్య ఉద్యమంలో చేరి, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని ఎన్నో మార్లు జైలు శిక్షను అనుభవించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఇండో పాకిస్తాన్ యుద్ధ సమయంలో జై జవాన్ జై కిసాన్ అనే నినాదంతో ఇటు రైతుల్లో అడ్డు సైన్యంలోనూ పూర్తి మించిన వ్యక్తి మనకందరికీ ఆదర్శ అవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా దిశా కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి, తిరుపతయ్య గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ, పట్టణ మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# 15న పెద్దకొత్తపల్లిలో అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు

**పెద్దకొత్తపల్లి, జనవరి 11 (నిజాయితి) :**
సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ నెల 15న పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని హై స్కూల్ గ్రౌండ్‌లో అంతర్ రాష్ట్ర వృషభ రాజుల న్యూ క్యాటగిరి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ బెట్టరి రేణుక నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 14వ సాయంత్రం 5 గంటలలోపు ఒక్క జతకు రూ. 1,000 ఎంట్రీ ఫీజుతో పేరు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 50 వేలు, రెండో బహుమతి రూ. 40 వేలు, మూడో బహుమతి రూ. 30 వేలు, నాలుగో బహుమతి రూ. 20 వేలు, ఐదో బహుమతి రూ. 10 వేలు అందజేస్తారు. అలాగే ప్రతి పాల్గొనే జతకు రూ. 5 వేల ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

## మహబూబ్‌నగర్ డీసీసీ కార్యాలయంలో కార్పొరేషన్ మహాసభ




**మహబూబ్‌నగర్ జనవరి 11 (నిజాయితి) :** మహబూబ్‌నగర్ డీసీసీ కార్యాలయంలో నేడు జరగనున్న కార్పొరేషన్ ఎన్నికలకు పోటీ పడుతున్న కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థుల సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ మహాసభను మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ మరియు ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల కోత్వాల్, టీపీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జాహిర్ అక్తర్ హాజరయ్యారు. అలాగే ఈ సమావేశంలోడీసీసీ ఉపాధ్యక్షులు సత్తిరి చంద్రశేఖర్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా రెడ్డి,మహబూబ్‌నగర్ జిల్లా కో–ఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలీ,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ఇంటీసీ జిల్లా అధ్యక్షుడు రాములు యాదవ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ వినోద్ కుమార్, మహిళా అధ్యక్షురాలు వసంతమార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పెద్ద విజయ్ ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, ఎంపీ వెంకటేష్, గోనెల శ్రీను, బుర్జు సుధాకర్ రెడ్డి, సిరక్ కాద్రి, తదితరులు ఈ సమావేశంలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ సమావేశంలో రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి తీసుకోవాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు.

## ఎస్‌ఎల్‌బిసి నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు: ఉత్తమ్




**హైదరాబాద్, జనవరి 11 (నిజాయితి) :** ఎస్‌ఎల్‌బిసి నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన చర్యలు: ఉత్తమ్‌హైదరాబాద్: శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్‌ఎల్‌బిసి) ప్రాజెక్టు నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎస్‌ఎల్‌బిసి పనుల పురోగతిపై ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇంజినీర్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్ పలువురు ఇంజినీరు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఎస్‌ఎల్‌బిసి పనుల పున'ప్రారంభం, సంబంధిత అంశాలపై చర్చ జరిపారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. సొరంగం తవ్వకాలకు ఆధునిక పరిజ్ఞానం వినియోగిస్తున్నామని అన్నారు. టిబిఎం స్థానంలో ఆధునిక పద్ధతిలో టన్నెల్ తవ్వకాలు జరుగుతాయని పేర్కొన్నారు. 9.8 కి.మీ సొరంగ మార్గంపై ఎలక్ట్రో మాగ్నెటిక్ సర్వే పూర్తైందని తెలిపారు. భూగర్భ పరిస్థితుల అంచనాకు సపోర్ట్ సిస్టం ఏర్పాటు చేశామన్నారు. సొరంగ మార్గం రెండువైపులా తవ్వకాలకు నిధులు మంజూరు చేశామని తెలిపారు. ప్రపంచంలోనే పొడవైన సొరంగ మార్గంగా ఎస్‌ఎల్‌బిసికి గుర్తింపు వచ్చిందని పేర్కొన్నారు. సొరంగ మార్గం పనుల్లో క్షేత్రస్థాయి సిబ్బందికి 25 శాతం అదనపు జీతాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌ఎల్‌బిసి సొరంగ నిర్మాణ పనులపై ప్రతి సోమవారం సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఎస్‌ఎల్‌బిసి పూర్తి చేసి నల్గొండలో ఫ్లోరోసిస్ లేకుండా చేస్తామని అన్నారు.

# జనసేనతో మాకెందుకు పొత్తు?: బిజెపి చీఫ్ రాంచందర్ రావు

**హైదరాబాద్, జనవరి 11 (నిజాయితి) :** "రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మేము ఒంటరిగానే పోటీ చేస్తాం, జన సేనతో పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదు.." అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తేల్చి చెప్పారు. ఇటీవల కొండగట్టు హనుమాన్ దేవాలయానికి వచ్చిన జనసేన అధ్యక్షుడు, ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిజెపితో కలిసి పోటీ చేస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. అయితే ఈ విషయంపై ఆదివారం తనను కలిసిన విలేకరులతో రాంచందర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో తమ పార్టీ బలంగా ఉందని, ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం తమకు లేదని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాలు వేరని, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా టిడిపి, బిజెపి, జనసేన కలిసి కూటమిగా ఏర్పడ్డాయని ఆయన చెప్పారు. తెలంగాణలో



పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని, కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు తాము ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతున్నామని ఆయన వివరించారు. కాబట్టి పొత్తు లేకుండానే మెజారిటీ స్థానాల్లో గెలుపొందగలమన్న విశ్వాసం ఉందన్నారు. పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదని తాము అధిష్టానం దృష్టికి తీసుకెళతామని ఆయన మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఇదిలాఉండగా పొత్తు విషయంలో రాంచందర్ రావు స్పష్టత ఇచ్చారు. పొత్తు ఉంటే కొంత మేలు జరుగుతుందేమో కానీ, సీట్ల పంపకాల్లో తమకు అవకాశాలు తగ్గుతాయన్న భావన కూడా బిజెపి నేతలు, కార్యకర్తల్లో ఉంది. రాంచందర్ రావు ప్రకటనపై పవన్ కళ్యాణ్ ఏ విధంగా స్పందిస్తారో వేచి చూద్దామని బిజెపి నాయకులు అంటున్నారు.

## ఇరాన్‌లో అల్లకల్లోలం.. 203 మంది మృతి.. అమెరికాకు దేశాధినేత వార్నింగ్

ఇరాన్‌లో ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదలతో ప్రజలు ఆందోళనకు దిగారు. 203 మంది మృతి, ఇంటర్నెట్ నిలిపివేత, అమెరికా–ఇజ్రాయెల్‌పై హెచ్చరికలు, ట్రంప్ స్పందన ఉద్రిక్తతను పెంచాయి. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటడం, ద్రవ్యోల్బణం పెరగడంతో ఇరాన్ వ్యాప్తంగా చెలరేగిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. ఈ నిరసనల్లో ఇప్పటివరకు కనీసం 203 మంది మరణించినట్లు సమాచారం. ఆహార పదార్థాల ధరలు భరించలేని స్థాయికి చేరడంతో ప్రజలు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తున్నారు. అయితే మృతుల సంఖ్య అధికారిక లెక్కల కంటే ఎక్కువే ఉండవచ్చని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అల్లర్ల వెనుక అమెరికా హస్తం ఉందని ఇరాన్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. చాలా ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ఆందోళనకారుల సమస్యలను వినడానికి తాము సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ప్రకటించినప్పటికీ, కొంతమంది అల్లరి మూకలు సమాజాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన హెచ్చరించారు. ప్రజల ఆగ్రహం చల్లార్చడంలో సంస్కరణవాదిగా పేరున్న అధ్యక్షుడు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ అమెరికా, ఇజ్రాయెల్‌లకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. తమ దేశంపై అమెరికా సైనిక చర్యకు దిగితే, ఆ ప్రాంతంలోని అమెరికా స్థావరాలు, నౌకలు తమకు చట్టబద్ధమైన లక్ష్యాలుగా మారుతాయని స్పష్టం చేశారు. దాడి జరిగే వరకు తాము వేచి ఉండబోమని, ముప్పు ఉందనే సంకేతాలు కనిపిస్తేనే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తేల్చిచెప్పారు. పార్లమెంటు సమావేశంలో ఎంపీలు "అమెరికా నశించాలి" అంటూ నినాదాలు చేయడం ఉద్రిక్తతను పెంచింది.

## రిషబ్ పంత్‌కి గాయం.. అతడి స్థానంలో జట్టులోకి ఎవరంటే..

**ఢిల్లీ, జనవరి 11 (నిజాయితి) :** టీం ఇండియా, న్యూజిలాండ్ మధ్య వన్డే సిరీస్ మరికొద్దిసేపట్లో ప్రారంభంకానుంది. ఆదివారం మధ్యాహ్నం 1.30కి వడోదర వేదికగా మ్యాచ్ స్టార్ట్ అవుతుంది. అయితే ఈ మ్యాచ్‌కి ముందు భారత్‌కు ఊహించని షాక్ తగిలింది. టీం ఇండియా స్టార్ వికెట్ కీపర్–బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్ గాయం కారణంగా ఈ సిరీస్‌కి దూరమయ్యాడు. ఉదయ భాగంలో అతడికి గాయమైంది. ప్రస్తుతం పంత్ బిసిసిఐ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు. అయితే రిషబ్ స్థానంలో జట్టులోకి ఎవరు వస్తారనే విషయంపై నెలకొన్న సందిగ్ధతకు బిసిసిఐ ముగింపు పలికింది. పంత్ స్థానంలో యువ క్రికెటర్ ధృవ్ జురెల్‌ని జట్టులోకి తీసుకుంటున్నట్లు ప్రకటించింది. విజయ్ హజారే ట్రోఫీలో జురెల్ రాణించడంతో అతడికి జట్టులో చోటు దక్కింది. మరి ధృవ్.. పంత్ స్థానాన్ని ఎంతవరకూ భర్తీ చేస్తాడో వేచి చూడాల్సిందే.




## కోహ్లీ ది గ్రేట్.. మరో అరుదైన రికార్డు

**వడోదర, జనవరి 11 (నిజాయితి) :** టీం ఇండియా స్టార్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ ఇప్పటికే ఎన్నో రికార్డులను బద్దలు కొట్టాడు. టెస్ట్‌లు, టి–20లకు రిటైర్‌మెంట్ ప్రకటించిన కోహ్లీ ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. గతేడాది సౌతాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేసిన కోహ్లీ.. ఆ తర్వాత విజయ్ హజరే ట్రోఫీలోనూ తన సత్తా నిరూపించుకున్నాడు. ఈ ఏడాదిని న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌తో ప్రారంభించాడు. బిసిఎ స్టేడియం వేదికగా జరుగుతున్న తొలి వన్డే మ్యాచ్‌లో మరోసారి తనకు తానే సాటి అనే విధంగా బ్యాటింగ్ చేస్తున్నాడు కోహ్లీ. ఈ క్రమంలో ఓ అరుదైన రికార్డును బద్దలు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో ప్రస్తుతం అర్థ శతకంతో బ్యాటింగ్ చేస్తున్న కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో రెండో స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో కుమార సంగక్కర(28,016) రికార్డును అధిగమించాడు. కోహ్లీ కంటే ముందు స్థానంలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ 34,357 పరుగులతో ఉన్నారు. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. ఈ లక్ష్య చేధనలో భారత్ ఒక వికెట్ కోల్పోయి 23 ఓవర్లలో 135 పరుగులు చేసింది. క్రీజ్‌లో కోహ్లీ (52), గిల్(46) ఉన్నారు. ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే.. భారత్‌కు ఇంకా 165 పరుగులు కావాల్సి ఉంది.



# రాణించిన మిచెల్.. భారత్ టార్గెట్ ఎంతంటే

**వడోదర, జనవరి 11 (నిజాయితి) :** మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బిసిఎ క్రికెట్ స్టేడియం వేదికగా జరుగుతున్న తొలి వన్డే మ్యాచ్‌లో న్యూజిలాండ్ భారీ స్కోర్ సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ చేసేందుకు ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో ఓపెనర్లు తొలి వికెట్‌కి 117 పరుగులు జోడించారు. ఈ ఇద్దరు హాఫ్ సెంచరీలు చేసి స్వల్ప వ్యవధిలోన ఔట్ అయ్యారు. దీంతో బ్యాటింగ్ వచ్చిన మిచెల్ విజృంభించాడు. ఓ పక్క వికెట్లు పడుతున్నా.. పట్టు వదలకుండా బ్యాటింగ్ చేశాడు. 71 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులతో 84 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. మిగితా వారందరూ చెప్పుకోదగ్గ స్కోర్ చేయలేదు. దీంతో న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 300 పరుగులు చేసింది. భారత బౌలింగ్‌లో హర్షిత్ రాణా, సిరాజ్, ప్రశిద్ధ్ చెరి రెండు, కుల్దీప్ ఒక వికెట్ తీశారు.



## ఇవి బ్యాటరీలకు ఆధార్ తరహా నెంబర్లు



**న్యూఢిల్లీ, జనవరి 11 (నిజాయితి) :** కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ శనివారం ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల సంబంధిత కీలక ముసాయిదా మార్గదర్శకాలు వెలువరించింది. ఇవి కార్లు ఇతర వాహనాలకు అత్యవసరంగా వాడే బ్యాటరీలకు ఇకపై ఆధార్ తరహా నిర్దిష్ట క్రమ సంఖ్యలను పొందుపర్చేందుకు ప్రతిపాదించారు. సమర్థవంతమైన రీ ఛార్జింగ్‌కు, వీటి ఉనికి తెలుసుకునేందుకు (ట్రెసిబులిటి) ఈ నెంబర్ల ప్రక్రియ ఉపయోగపడుతుందని మార్గదర్శకాలలో మంత్రిత్వ శాఖ తెలిపింది. ముసాయిదా అమలులోకి వస్తే బ్యాటరీల ఉత్పత్తిదార్లు లేదా దిగుమతిదార్లు తప్పనిసరిగా వీటికి 21 అంకెల బ్యాటరీ ప్యాక్ ఆధార్ నెంబరు అంటే బిపిఎఎన్‌ను తప్పనిసరిగా పొందుపర్చుకోవల్సి ఉంటుంది. లేకపోతే ఇటువంటి బ్యాటరీలు ఉనికిలోనికి రావడానికి వీలుండదు. బిపిఎఎన్ అధికారిక పోర్టల్‌లో సంబంధిత బ్యాటరీ ప్యాక్ డైనమిక్ డేటాను జతచేయాల్సి ఉంటుంది. ఈ మేరకు బ్యాటరీల ఉత్పత్తిదార్లకు ఈ నిబంధన తప్పనిసరి చేస్తారు. మార్కెట్‌లోకి పంపే ప్రతి బ్యాటరీకి ఈ నెంబరు నిర్దిష్టంగా ఉండటంతో వాటిని గుర్తించేందుకు వీలేర్పడుతుంది. రీసైక్లింగ్ ప్రక్రియ సులభతరం

# ఆసియా ఖండాన్ని కదిలించిన తెలంగాణ కుంభమేళా సమ్మక్కసారక్కల త్యాగ గాథతో వెలుగొందుతున్న మేడారం జాతర

ఆసియా ఖండాన్ని కదిలించిన తెలంగాణ కుంభమేళా మేడారం జాతరసమ్మక్కసారక్కల త్యాగ గాథతో వెలుగొందుతున్న మేడారం జాతరఆసియా లోనే అతిపెద్ద గిరిజనల జాతర మేడారం. మేడారం అంటే దీరవనితల పోరాట గాధ,ఆదివాసి కోయా దొరల ఆత్మగౌరవశీ.700 సంవత్సరాలనుండి నుండి ఈ మేడారం జాతరని జరుపుకుంటున్నారు.మేడారం జాతర ని 1996 ఫిబ్రవరి 01 అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగ గుర్తించినది.దేశం నలుమూలల నుండి కుల, మత, ప్రాంతం బేధం లేకుండా ఇసుక వేస్తె రాలనంత కోటను, కోట్లాది మంది ప్రజలు జాతరకి తరలి వస్తారు.

## సమ్మక్క తల్లి పోరాటానికి ప్రతీక

ఆదివాసీల కథనం ప్రకారం సమ్మక్క తల్లికి తల్లిదండ్రులు లేరు, అడవుల్లో నివసిస్తున్న కోయవారికి ఒక పసిపిల్ల ఏడుపు వినిపిస్తూ ఉంటుంది. దీంతో అడవి లోపలికి వెళ్లి చూస్తే ఒక పుట్టపైన పసికందు పడుకొని ఉంటుంది. కానీ తన చుట్టూ మాత్రం కాపలాగా పులులు సింహాలు ఉన్నాయి, దీంతో అ పసికందును దైవాజ్ఞురాలిగా భావించి అక్కడ కోయ జాతికి చెందిన పెద్ద తన చెంతకు తీసుకొని "సమ్మక్క" అని నామకరణం చేస్తాడు. ఇక్కడి నుండి సమ్మక్క తల్లి యొక్క జీవితం మొదలవుతుంది. తాను ఆ గూడెం కి రాకముందు అక్కడ నివాస్తున్న ప్రజలు, కష్ట, నష్టాలలో కోరుపోయి, అనారోగ్య తో బాధపడుతూ ఉంటారు. కానీ సమ్మక్క తల్లి రాకతో కోయ గూడెం లో నివసిస్తున్న కోయ ఆదివాసీల కష్టాలు మెల్లమెల్లగా తగ్గు మొఖం పడినవి. అక్కడ ప్రజలు అనారోగ్యం బారిన పడినప్పుడు సమ్మక్క తల్లి తన చేతితో ఆకుపసరిచ్చిన వారికి ఆరోగ్యం మెరుగు పడేది. సమ్మక్క తల్లి అన్ని యుద్ధ విద్యలో అరితేరిన వీర వనిత.

## పగిడిద్దరాజు ఆదివాసీల రక్షణ కవచం

12 వ,13వ శతబ్దంలో కాకతీయులు వరంగల్ రాజ్యాని కేంద్రం గా చేసుకొని పరిపాలిస్తున్న తరుణంలో పగిడిద్దరాజు మేడారం అడవి ప్రాంతాల్లో సమంత పాలకుడిగా పనిచేసేవాడు. ఇతను కోయ జాతికి చెందినవాడు. పగిడిద్దరాజు అన్ని యుద్ధ విద్యలో నేర్చుకున్న యోధుడు, అతను ఆదివాసీలకు రక్షణ కావచంగా నీలిచేవాడు. సమ్మక్క కు అన్ని విధాలుగా సరితుగిన వాడు కావడం తో, సమ్మక్కతో పగిడిద్దారాజు కి వివాహం జరుగుతుంది. ఇలా వీరి వైవహిక జీవితం ఎంతో ఆనందంగా కొనసాగుతుంది.వీరికి, సంతానంగా సారక్క, నాగులమ్మ, జంపన్న జన్మిస్తారు. దీంతో వారి సంతోషానికి అవదులు ఉండవు. కాకతీయుల పన్ను విధానం యుద్ధానికి కారణం కాకతీయ రాజ్య విస్తరణలో భాగంగా ప్రతాపరుద్రుడు అడవిలో ప్రాంతంలో నివసిస్తున్న వారి పైన అధిక పన్ను విధించడం మొదలు పెట్టారు. దీంతో అక్కడ ఆదివాసీ ప్రజలు సరిగా పంటలు పండగ నష్టం రావడంతో వారు పన్ను చెల్లించలేకపోతున్నాము కబురు పంపారు. దీంతో ప్రతాపరుద్రుడు తన రాజ్య సమంతులను అ ప్రాంతానికి పంపుతాడు వారు చెప్పినది నిజామా, కదా అని మేడారం ప్రాంతానికి వచ్చిన సామంతులు అక్కడి పరిస్థితుల చూసి వారు చెప్పిన సమాచారశీ నిజమే అని చెప్పిన ప్రతాపరుద్రుడు పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నా కూడ అనుకున్న ప్రకారం పన్ను కట్టాలి అని చెప్పడం జరుగుతుంది.దీంతో పగిడిద్దరాజు కాకతీయులకు ఎదురు తిరగడం జరుగుతుంది. దీంతో కాకతీయలు సైనిక నియామకం, సమంతుల నియామకం అధికంగా పెంచుకున్నారు. ఈ తరుణంలో తన సైన్యశీతో అతి కిరాతకంగా పగిడిద్దరాజు పైన దాడి చేశారు ఈ పోరాటం లో పగిడిద్దరాజు దయ్యాల మడుగులో దూకి వీరమరణం పొందాడు.

## సమ్మక్క- సారక్క – జంపన్న వీరమరణం

భర్త మరణాంతరం సమ్మక్క తల్లి సైన్యని సమీకరించి కోయ గోండు వారిని ఏకం చేసింది. కాకతీయుల సైన్యంతో పోరాటం చేస్తున్నప్పుడు కాకతీయ సైన్యం వెన్నుపోటు పొడవడంతో కోన ఊపిరితో నడుచుకుంటూ చిలుకలగట్టు పైన ఒక చెట్టు కింద కుంకుమ భరణిగా మారుతుంది.దీంతో అన్ని యుద్ధ విద్యలో నేర్చుకున్న సారక్క తల్లి, సమ్మక్క తల్లి సైన్యానికి దైవ ప్రదాతగా ఉండేది ఆదివాసి సైన్యాన్ని ముందుండి నడిపిన వీర వనిత అటవీ యుద్ధంలో శత్రువులను ఎదిరించిన దీరవనిత. శత్రువుల యొక్క వెన్నుపోటుతో యుద్ధంలో వీరమరణం పొందింది. సమ్మక్క తల్లి కుమారుడు జంపన్న వెనుక బాగా రక్షకుడిగా ఉండేవాడు. శత్రు సైన్యం లోపలికి రాకుండా అడవుల్లో వాగులు వంకల దారుల్లో రక్షకుడిగా ఉండేవాడు. యుద్ధ సమయంలో శత్రు సైన్యాన్ని అడవి లోపలికి రాకుండా అడ్డుకునే సమయంలో జంపన్న సంపన్న వాగు సమీపంలో వీరమరణం పొందడం జరిగింది. జంపన్న రక్తం ఏరులై పారుకుంటూ వెళ్లి సంపన్న వాగుల్లో కలిసింది. అప్పటినుండి సంపన్న వాగుని జంపన్న వాగు అని పిలుస్తారు. వీళ్ళు వీరమరణంతో చెందడం తో వీళ్లకి గుర్తుగా మేడారం జాతరను ఆదివాసీలు, కోయ వారు జరుపుకున్నారు. దీంతో అప్పటి నుండి మేడారం జాతర ప్రారంభం అయ్యింది.

## మేడారం జాతర విశిష్టత, గద్దెల మీదకి తల్లుల ఆగమనం

ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మగమాసంలో మేడారం జాతర ను జరుపుకుంటారు. ఈ జాతర ని బుధవారం, గురువారం, శుక్రవారం, శనివారం,ఈ నాలుగు రోజుల పటు జరుపుకుంటారు.ఇది అతిపెద్ద ఆదివాసీ జాతరగా ప్రసిద్ధి చెందింది. ఈ జాతరలో సమ్మక్క, సారక్క, పగిడిద్దరాజు, గోవిందరాజులను గద్దెల మీదికి తీసుకువచ్చే సంప్రదాయం చాలా ప్రత్యేకమైనది.

## సారక్క తల్లి

మొదటి రోజు బుధవారం నాడు ఆరవ గొట్టుకు చెందిన పూజారులు ఉదయం చేసి స్నానం చేసి ఎవరు చూడకుండా ప్రత్యేకమైన పూజలు చేసి కన్నేపల్లి గ్రామం నుండి బంగారు బంతి,పసుపు, కుంకుమ,ను వేదురు లంక ని ఎవరికీ కనపడకుండా ఎర్రటి వస్త్రం కప్పి పూజారులు, అధికారులు తల్లిని గద్దెల మీదకి తీసికువచ్చేటప్పుడు ఆదివాసీలు నృత్యాలు చేస్తూ భక్తులు వాయిద్యాలతో ఊరేగింపు చేస్తూ గద్దెల మీదికి తీసుకువస్తున్న సమయంలో పిల్లలు కానీ వాళ్ళు తల్లి రకకు ఎదురుగా పడుకుంటారు. ఎందుకంటే ఆ తల్లి వారి మీదనుండి నడుచుకుంటూ వెళ్తే వారికి పిల్లలు అవుతారు అని నమ్మి ఆలా చేస్తారు. అమ్మవారిని గద్దెల మీదకు తీసుకువెళ్లే ముందు తన సోదరుడు అయినా జంపన్న వాగు దగ్గరికి తీసుకొని వెళ్తారు అక్కడ తన సోదరుడికి ఆశీర్వాదం ఇచ్చిన తర్వాత గద్దెల మీదకి తీసుకున్న వస్తున్నా సమయంలో ఆకాశంలో మెరుపుల కనిపిస్తుంది. గద్దెల మీద ప్రతిష్ఠించే సమయంలో అధికార లంచనలతో తో గాలిలోకి తుపాకులు గుండ్లను పేల్చి సారక్క తల్లిని ప్రతిష్టిస్తారు.ఈ సమయంలో భక్తులు శిగలు ఊగుకుంటూ తల్లి కి పరుగులు పెడతారు. సారక్క తల్లికి అనేక పేర్లతో పిలుస్తారు. అవి రక్త సారక్క, మూగ సారక్క, పసుపు సారక్క, కుంకుమ సారక్క, నీళ్ల సారక్క, ఆకుసారక్క, కొమ్మ సారక్క, పువ్వు సారక్కముద్ద సారక్క ఇలా అనేకమైన పేర్లతో పిలుస్తారు. ఆరవ గొట్టుకి చాలా ప్రత్యేకత ఉంది కోయ సమాజం లో ధర్మం కోసం ప్రాణ త్యాగం చేసిన కుమార్తెగా వంశంలో గుర్తింపు ఉంటుంది.

## సమ్మక్క తల్లి

రెండవ రోజు గురువారం రోజున ఐదోవా గొట్టు కు చెందిన కోయ పూజారులు అందరు ఎవరు చూడకుండా ఉదయనే లేచి స్నానం చేసుకొని భక్తి శ్రద్దలతో పూజలు చేసి సమ్మక్క తల్లిని చిలుకల గుట్ట అడవి నుండి ఒక కుంకుమ కాయ రూపంలో తీసుకు వస్తారు దీనితో పటు వేదురు లంక కూడ తీసుకొని వస్తారు.ఎందుకంటే ఈ తల్లికి విగ్రహం ఉండదు; ఎర్రటి వస్త్రం తో కప్పి ఉంచి ఎవరికీ కనపడకుండా పూజారులు, అధికారులు భారీ బందొబస్తూ తో అమ్మవారిని గద్దెల మీదికి తీసుకు వచ్చేటప్పుడు అధికారిక లంచనలతో గాలిలోకి తుపాకులను పేల్చడం జరుగుతుంది. అర్ధరాత్రి గౌరవంగా గద్దెపైకి తీసుకున్నా క్రమంలో ముందుగా తన కొడుకు అయినా జంపన్న వాగులోకి సమ్మక్క తల్లిని తీసుకొని వెళ్లి తరువాత గద్దెల పైకి తీసుకువస్తున్న సమయంలో ఆకాశం లో ఉరుము లాగా, మెరుపు లాగా కనిపిస్తుంది గద్దెల మీద ప్రతిష్టపిస్తున్న సమయంలో భక్తులు శిగలు ఊగుకుంటూ ఒడిబియ్యం నడుముకు కట్టుకొని తల్లి చెంతకు చేరుతారు.

## పగిడిద్దరాజు

మొదటి రోజు బుధవారం నాడు ఐదవ గొట్టుకు చెందిన పూజారులు, పెద్దలు ప్రత్యేకమైన పూజలు చేసి పగిడిద్దరాజు ను పెనుగొండ్ల గ్రామం నుండి ఒక కట్టని అలంకరణ చేసి పెండ్లి కొడుకుగా ముస్తాబు చేసి మేడారం తీస్కువాస్తున్నప్పుడు పూజారులు అధికారులు వెంట ఉండి తీసుకు వస్తున్నా సమయంలో మొదటగా తన కుమారుడైన జంపన్న వాగులోకి వెళ్లిన తరువాతనే గద్దెపైకి తీసుకువచ్చి ప్రతిష్టిస్తున్నప్పుడు అధికారులు గాలిలోలికి తుపాకుల గుండ్ల పేలుస్తారు. తరువాత రోజున సమ్మక్క తల్లి గద్దెల మీద ప్రతిష్ఠించిన అనంతరం సమ్మక్క తల్లికి పగిడిద్దరాజుకి పూజారులు వివాహం జరిపిస్తారు. పగిడిద్దరాజు ను ఆదివాసీల ధర్మయోధుడు, వంశ రక్షకుడు అని భావిస్తారు.

## గోవిందరాజు

మొదటి రోజు బుధవారం నాడు ఏడవ గొట్టుకు చెందిన పూజారులు ప్రత్యేకమైన పూజలు నిర్వహించి కొండయీ గ్రామం నుండి ఒక చెక్కని అలంకరణ చేసి గోవిందరాజు రూపంగా మేడారం కి తీసుకువస్తున్న పూజారులు నెత్తి పైన ఎర్రటి వస్త్రం కప్పుకొని గోవిందరాజు ని ముందుగా జంపన్న వాగులోకి తీసుకొని వెళ్లిన అనంతరం గద్దెల మీద ప్రతిష్టిస్తున్నప్పుడు అధికారులు గాలిలోనికి తుపాకుల తుటాలను పేలుస్తారు. ఇతడిని వంశ పరిరక్షకుడిగా, జాతర నిర్వహణలో కీలక పాత్రధారిగా పరిగణించబడతాడు.

## నాగులమ్మ

సమ్మక్క-సారక్క జాతరలో నాగులమ్మ కి భక్తులు ప్రత్యేకమైన పూజలు నిర్వహిస్తారు.నాగులమ్మను ఆదివాసీ కోయలు సర్ప దేవతగా, భూమి తల్లి శక్తిగా ఆరాధిస్తారు.నాగులు భూమి లోతుల్లో నివసించే శక్తులు అని, అవే నీటి వనరులకు, నేల సారానికి మూల ధరమణి వారి నమ్మకం.భక్తులు సర్ప భయం తొలగాలని, సంతాన భాగ్యం కలగాలని, పంటలు పండాలని నాగులమ్మ పుట్ట దగ్గరికి వెళ్లి మొక్కులు చెల్లిస్తారు. నాగులమ్మ అనుగ్రహం ఉంటే జాతర సమయంలో ఎలాంటి కీడు జరగదని ఆదివాసీల విశ్వాసం.నాగులమ్మకి పాలతో అభిషేకం, పసుపు, కుంకుమ, నువ్వులు, బెల్లంతో పూజలు చేస్తారు.

## జంపన్న

జంపన్న ఆరవ గొట్టుకు చెందిన వ్యక్తి, మేడారం వెళ్లిన ప్రతీ ఒక్కరు ముందుగా జంపన్న వాగులో స్నానంలు చేస్తే చేసిన పాపాలు తొలిగిపోతాయి, శరీర శుద్ధి అవుతుంది, మనసులో ఇలాంటి చెడు ఆలోచనలు ఉండవు అని నమ్ముతారు. ముందుగా జంపన్న వాగులో జలకలు ఆడిన తర్వాతానే సమ్మక్క - సారక్క దర్శనానికి తడిబట్టలతో వెళ్తారు. అలాగే పెండ్లి కానీ యువతీ, యువకుల చేత త్వరగా పెండ్లి కావాలని జంపన్న వద్ద భాషింగలు కడతారు, పెండ్లి అయినా పిల్లలు కానీ త్వరగా పిల్లలు కావాలని తొట్టెల్లు కడతారు. ఈ విధంగా జంపన్న కాడ ప్రత్యేకమైన పూజలు నిర్వహిస్తారు. సమ్మక్క-సారక్క తల్లులు గద్దెల మీదకి వచ్చినప్పటి నుండి భక్తులు కొబ్బరికాయలు, పసుపు,కుంకుమ తల్లులకు సమర్పిస్తారు.ఎదిరిచి మొక్కి కోళ్ళ, యాటపోతులు, బలులు, ఇచ్చి వండుకొని తిని, నిలువెత్తు బంగారాన్ని మొక్కుగా చెల్లిస్తారు. శివసత్తులు ఓడి బియ్యం నడుముకు కట్టుకొని శిగలు ఊగుకుంటూ తల్లుల చెంతకు చేరి మొక్కలు సమర్పించుకుంటారు. మేడారం వచ్చిన భక్తుల్ని అ తల్లులు కంటికి రెప్పలా కావాలి ఉంటూ తమ భక్తుల్ని కాపాడుకుంటారు. మేడారంలో పుట్టాను మొక్కిన చెట్టును మొక్కిన కోరికలు తీరుతాయి అంటూ భక్తులు నమ్ముతారు. కోరిన వారికి కొంగుబంగారమై నిలుస్తారు. వచ్చిన భక్తులు తల్లి మాకు మల్ల అంత మంచే జరుగుతే మల్లి వచ్చే రాండవకు మా పిల్ల జల్లలతో కలిసి వచ్చి నీకు మొక్కులు సమర్పిస్తాం తల్లి అని భక్తులు మొక్కుకుంటారు. మేడారం వెళ్లిన ప్రతి ఒక్కరు తల్లిని దర్శించుకున్న తర్వాత ఇంటికి వెళ్లేటప్పుడు కచ్చితంగా వెదురులంకని తీసుకొని వెళ్తారు. ఎందుకంటే వెదురులంక తల్లికి చాలా ఇష్టమైనది. వెదురులంకలోనే తల్లులని కొలుస్తారు. సమ్మక్క- సారక్క తల్లులు కోరిన వారికి కొడుకులను ఇస్తారు అడిగిన వారికి ఆడపిల్లలను ఇస్తారు. నాల్గవ రోజు తిరిగి తల్లులు వనంలోకి వెళ్ళిపోతారు. ఈ విధంగా మేడారం జాతర వైభవం జరుగుతుంది.

## చిలకల గట్టు

చిలకల గట్టు పైన సమ్మక్క తల్లి కుంకుమ భరణి మారడం ఒక దైవ విశేషం. అందుకని చిలకల గట్టుకు చాలా ప్రత్యేకత ఉంటుంది. చిలకల గట్టు పైనుండి వచ్చే నీరు చాలా విశిష్టమైనది. ఎందుకంటే ఒక్క నిమిషం ఆగకుండా ఎల్లప్పుడూ నీరు కిందికి వస్తేనే ఉంటుంది ఆ నీరు ఎక్కడ నుండి వస్తుంది, నది ఎక్కడుంది, లేద వాగు నుండి వస్తుందా అనేది ఇప్పటివరకు కూడా తెలియదు కానీ ఆదివాసీల ప్రకారం చిలుకల గట్టు పై వచ్చే నీరు కొండకోనల్లో నుండి సమ్మక్క తల్లి మహిమతోనే ఈ నదిలాగా నీరు కిందికి వస్తుంది. మేడారం వచ్చిన భక్తులు ఈ నీటిని తీసుకోని వెళ్తారు. ఈ నీటి యొక్క ప్రత్యేకత ఏమిటి అంటే మనకి ఆరోగ్యం బాగా లేనప్పుడు ఈ నీటిని తాగితే ఆరోగ్యం మెరుగు పడుతుందని ప్రజల నమ్మకం. అలాగే ఈ చిలుకల గట్టునుండి తెచ్చిన నీటిని సంవత్సరం పాటు అలాగే బాటిల్ లో పెట్టిన పాకురు రాదు,అంతే స్వచ్ఛంగా నీరు ఉంటుంది.గట్టు అంటే కోయా సంప్రదాయంలో దేవతలతో సంబంధం ఉన్న వంశ స్థానం అని అర్థం.ఈ గట్టు చరిత్ర సమ్మక్క తల్లి కాలం నాటికే వెళ్తుంది అని ఆదివాసీల నమ్మకం.సమ్మక్క తల్లి వనవాసంలో ఉన్న సమయంలో ఆమెకు అంకితమైన ఆచారాలు ఈ గట్టు ద్వారా కొనసాగినట్లు కథనాలు ఉన్నాయి.

## గట్టమ్మ దేవాలయం

గట్టమ్మ దేవత మేడారంకు రక్షక దేవతగా భావిస్తారు.అడవులు, గుట్టలు, గ్రామ సరిహద్దులను కాపాడే శక్తిగా పూజిస్తారు. జాతరకు వచ్చే భక్తులు ముందుగా గట్టమ్మకు దేవాలయానికి మొక్కు చెల్లించి, ఆపై సమ్మక్కసారలమ్మ దర్శనానికి వెళ్తారు.కొబ్బరికాయలు, పసుపుకుంకుమ, బోనాలు నైవేద్యంగా సమర్పిస్తారు. గట్టమ్మ అనుగ్రహం లేకుండా జాతర సక్రమంగా జరగదు ఆదివాసీ, కోయవారి నమ్మకం.జాతర సమయంలో వచ్చే భక్తులకు ఎలాంటి అపకీర్తి జరగకూడదని గట్టమ్మను మొక్కుతారు.

## పునర్నిర్మాణం ఆదివాసి కోయ చరిత్రకు శిల్ప సాక్ష్యం

మేడారం జాతర యొక్క విశిష్ట వచ్చే తరానికి తెలియాలి అని నేడు తెలంగాణ ప్రభుత్వం సమ్మక్క- సారక్క, పగిడిద్దరాజు, గోవిందరాజు, గద్దెలను పునర్నిర్మానం చేస్తుంది.గిరిజన సంప్రదాయాలు చెక్కు చెదారకుండా పాలరాతితో అమ్మవార్ల గద్దెలను నిర్మించారు.930 ఏళ్ల కోయల తాళపత్ర గ్రంథాల సాక్ష్యంగా నిలిచే శిల్ప రూపకల్పన చేశారు.తరతరాలుగా కోయ ఆదివాసీ సమాజం కాపాడుకుంటూ వచ్చిన 930 సంవత్సరాల ప్రాచీన తాళపత్ర గ్రంథాలు ఈ శిల్ప రూపకల్పనకు మూలాధారం. ఇవి కేవలం లిఖిత ఆధారాలు మాత్రమే కాకుండా, కోయల జీవన విధానం, వన దేవతల ఆరాధన, ప్రకృతి పట్ల వారి అవగాహన, సామాజిక నిర్మాణాన్ని ప్రతిబింబించే ఆధ్యాత్మిక సాంస్కృతిక సాక్ష్యాలు.ఆ గ్రంథాలలో పేర్కొన్న సంకేతాలు, గణిత సమతుల్యత, దిక్సూచి భావనలను అనుసరించి 46 స్తంభాలతో 271 చ.మీ విస్తీర్ణంలో ప్రాకారం నిర్మించబడింది. ఈ 46 స్తంభాలు కోయల సామాజిక వ్యవస్థలోని గోత్రాలు, వంశ పరంపరలు, కాలచక్రాన్ని సూచిస్తాయి. ప్రతి స్తంభం ఒక చరిత్ర, ఒక తరం, ఒక జీవన తత్వాన్ని మోస్తూ నిలుస్తుంది.మధ్య భాగంలో నిర్మించిన 8 స్తంభాలతో వృత్తాకార గద్దె కోయల విశ్వ దృక్పథానికి ప్రతీక. ఈ 8 స్తంభాలు అష్టదిక్కులు, ప్రకృతి శక్తులు, కాల ప్రవాహం, సమ్మక్కసారక్క వన దేవతల రక్షణ చక్రాన్ని సూచిస్తుంది.ఎడమ వైపు పిల్లర్ సమ్మక్క తల్లి వంశ పరంపరకు ప్రతీకమేడారం సమ్మక్కసారక్క జాతర ప్రాంగణంలో నిర్మించిన ఎడమ వైపు పిల్లర్ పూర్తిగా సమ్మక్క తల్లి వంశం, కోయ ఆదివాసీ సంస్కృతి, ప్రకృతి ఆరాధనను ప్రతిబింబించేలా రూపొందించబడింది. ఈ పిల్లర్‌పై ఉన్న ప్రతి సింబల్‌కు ప్రత్యేకమైన చారిత్రక, ఆధ్యాత్మిక అర్థం ఉంది.

## మొదటి సింబల్ అయిదు పలకలు

ఈ అయిదు పలకలు సమ్మక్క తల్లి చెందిన ఐదవ గొట్టు వంశాన్ని సూచిస్తాయి. ఇది సమ్మక్క తల్లి యొక్క తల్లి వంశానికి సంబంధించిన రాజ్య సింబల్‌గా కోయలు భావిస్తారు.

## రెండవ సింబల్ నుదుటి బొట్టు

గుర్తుపూర్వకాలంలో కోయలు తమ వంశం, గొట్టు, గోత్రాన్ని గుర్తించేందుకు నుదుటిపై ప్రత్యేక బొట్టు పెట్టుకునేవారు.త్రిశూలం పోలిన ఈ గుర్తు సమ్మక్క తల్లి వంశానికి చెందిన నుదుటి బొట్టు సింబల్‌గా భావించబడుతుంది.

## మూడవ సింబల్ అయిదు నిలువు గీతలు

ఈ ఐదు నిలువు గీతలు కూడా సమ్మక్క తల్లి ఐదవ గొట్టు వంశానికి చెందినదని స్పష్టంగా తెలియజేస్తాయి.

## నాల్గవ సింబల్ నక్షత్రం


నక్షత్రం గుర్తు ద్వారా,సమ్మక్క తల్లి నక్షత్ర రూపంలో ఆకాశంలో వెలుగొందుతుందని కోయలు విశ్వసిస్తారు. ఇది దైవత్వం, ఆకాశీయ శక్తికి ప్రతీక. స్వస్తిక్ సింబల్ ప్రకృతి ఆరాధనకు చిహ్నం స్వస్తిక్ అనేది సిద్ధబోయిన వారి పూజా విధానంలో అత్యంత ముఖ్యమైన సింబల్.పూర్వకాలం నుంచి సిద్ధబోయిన వారు మూడు బొట్లపై కుంకుమతో స్వస్తిక్ వేయడం ఆనవాయితీగా వస్తోంది.

## స్వస్తిక్ అర్థం

భూమి తన చుట్టూ తాను కుడి నుండి ఎడమకు తిరగడం9 గ్రహాలు కూడా అదే దిశలో పరిభ్రమించడంసముద్రం, నీటిలో సుడిగుండం,సుడిగాలివృక్షాల తీగల పెరుగుదల, ఇలా ప్రకృతిలోని ప్రతి కదలిక కుడి నుండి ఎడమకు జరుగుతుంది.అందుకే ప్రకృతినే దైవంగా ఆరాధించే ఆదివాసీలు స్వస్తిక్‌ను పవిత్ర దైవ సింబల్‌గా పూజిస్తారు. కింద భాగం ఆదివాసీ ఆలయ ప్రాంగణం పిల్లర్ దిగువ భాగంలో అడవి దున్న కొమ్ములు నెమలి ఈకలు కోయ నృత్యం చేస్తున్న దృశ్యంవంటి అంశాలతో ఆదివాసీల ఆలయ ప్రాంగణం, సంస్కృతి, ఆచారాలు జీవంతంగా ప్రతిబింబించేలా రూపకల్పన చేశారు.

## మేడారంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు

మేడారం ప్రాంతానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కాకూడదు 110 కోట్ల బడ్జెట్ ని మేడారం ప్రాంతానికి నిధులు అందించారు. రవాణా సౌకర్యం కల్పించేందుకు 50 ఏకురాల స్థలం లో బస్టాప్ ఏర్పాటు చేశారు. త్రాగునీటిని సౌకర్యం ఏర్పాటు చేశారు. జంపన్న వాగు వద్ద శాశ్వత స్నాన ఘాట్లను ఏర్పాటు చేశారు.భక్తులకు దర్శన సౌకర్యం మెరుగుపడేలా విస్తరణ,వేలాది సంఖ్యలో డ్రైనేజీ వ్యవస్థ,అలాగే శాశ్వత విద్యుత్ లైన్ల సౌకర్యంలను ఏర్పాటు చేశారు,శాశ్వత ఆరోగ్య కేంద్ర భవనాలు అంబులెన్స్ పార్కింగ్, ప్రథమ చికిత్స కేంద్రాలుఫైర్ సేఫ్టీ, విపత్తు నిర్వహణ ఏర్పాట్లు చేశారు,షెడ్లు, క్యూలైన్లు తాత్కాలిక నివాస ఏర్పాట్లు,సమాచార కేంద్రాలు, పోలీస్ అవుట్‌పోస్టులు మొదలగునవి.ప్రభుత్వం ఇలా అనేక రకాలుగా మేడారంను అభివృద్ధి చేస్తుంది..



ఏర్పుల వర్షశ్రీ
(ఎంసిజే)

TGTEL/25/A3750 ... నిజమే ...
నిజాయితి
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక



# ఇండియాలో ఓవర్‌నైట్ స్టార్‌గా..



కన్నడ స్టార్ హీరో యశ్ తాజాగా నటిస్తున్న చిత్రం టాక్సిక్. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నయనతార, రుక్మిణి వసంత్, కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషీ హీరోయిన్లుగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఐదుగురు హీరోయిన్ల పోస్టర్లు విడుదలైన మంచి స్పందనను తెచ్చుకున్నాయి. ఇక తాజాగా యశ్ పుట్టినరోజు కానుకగా రాయ ఇంట్రడక్షన్ గ్లింప్స్‌ని రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్‌లో యశ్.. కారులో ఒక అమ్మాయితో రొమాన్స్ చేస్తూ ఉంటాడు. కారులో హీరోతో రొమాన్స్ చేస్తున్న అమ్మాయే నటాలీ బర్న్. గ్లింప్స్ రిలీజ్ అయ్యాక ఈ బ్యూటీ ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. నటాలీ బర్న్.. ఒక అమెరికన్, ఉక్రెయిన్ నటి. హాలీవుడ్‌లో యాక్షన్, థ్రిల్లర్ మూవీస్‌లో నటించి మెప్పించింది. ఆమె నిర్మాతగా కూడా పలు సినిమాలను తెరకెక్కించింది.

## సినిమాల మధ్య అంత గ్యాప్ ఎందుకు,, నవీన్ పోలిశెట్టి సమాధానం ఇదే!



తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో నవీన్ పోలిశెట్టి సంక్రాంతికి రాబోతున్న అనగనగా ఒక రాజు సినిమాపై భారీ ఆశలు పెట్టుకున్నారు. తాజాగా సినిమాల మధ్య గ్యాప్ తీసుకోవడానికి కారణం ప్రేక్షకుడి డబ్బుకు న్యాయం చేయాలన్న ఆలోచనేనని తెలిపారు. ముంబయిలో అవకాశాల కోసం తీవ్రంగా కష్టపడిన రోజులను గుర్తు చేసుకున్నారు. క్వాలిటీ కథలకే ప్రాధాన్యం ఇస్తానని, అందుకే ఆచితూచి సినిమాలు ఎంపిక చేసుకుంటానని చెప్పారు. ఈ సినిమా తన కెరీర్‌లో మరో ప్రత్యేకమైన అనుభూతినిస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు. తెలుగు సినీ పరిశ్రమలో తనదైన కామెడీ టైమింగ్, సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి . 'తక్కువ సినిమాలుఎక్కువ ఇంపాక్ట్' అనే ఫార్ములాతో ముందుకెళ్తున్న నవీన్, ప్రతి ప్రాజెక్ట్‌తో కొత్తదనాన్ని చూపిస్తున్నాడు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'తో క్రైమ్‌కామెడీకి కొత్త ఊపునిచ్చిన ఆయన 'జాతిరత్నాలు'తో మాస్ ఆడియెన్స్‌ను విపరీతంగా ఆకట్టుకున్నారు. ఆ తర్వాత 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'తో క్లాస్, మల్టీప్లెక్స్ ప్రేక్షకులను పలకరించారు. ఇప్పుడు అదే జోష్‌తో సంక్రాంతి కానుకగా జనవరి 14న రాబోతున్న తాజా చిత్రం ' అనగనగా ఒక రాజు 'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో, మీనాక్షి చౌదరి కథానాయికగా నటించిన ఈ మూవీ ట్రైలర్‌కు ఇప్పటికే మంచి స్పందన వచ్చింది. గోదావరి ప్రాంత యువకుడిగా నవీన్ చూపించిన వెటకారం, స్థానిక యాస, కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా నవీన్ తన కెరీర్, వ్యక్తిగత అనుభవాలపై ఆసక్తికరంగా మాట్లాడాడు. సినిమాల మధ్య ఎక్కువ గ్యాప్ ఎందుకు తీసుకుంటున్నావన్న ప్రశ్నకు, ప్రేక్షకుడు థియేటర్‌కి వచ్చి పెట్టే ప్రతి రూపాయికీ న్యాయం చేయాలన్నదే తన లక్ష్యమని స్పష్టం చేశాడు. ముంబయిలో అవకాశాల కోసం తిరుగుతున్న రోజుల్లో, థియేటర్‌కి వెళ్లడానికి కూడా డబ్బులు లేక ఇబ్బంది పడ్డ రోజులను గుర్తు చేసుకున్నాడు. అప్పట్లో సినిమా చూసి నచ్చకపోతే కలిగే బాధ తనకు బాగా తెలుసని, అందుకే ప్రేక్షకుడికి అలాంటి అనుభూతి రాకూడదనే ఆచితూచి కథలు ఎంచుకుంటున్నానని చెప్పాడు. తొలినాళ్ల కష్టాల గురించి మాట్లాడుతూ, నటుడిగా మారాలన్న తన నిర్ణయంపై ఇంట్లో పెద్ద చర్చలు జరిగాయని, ముఖ్యంగా నాన్నతో అభిప్రాయ భేదాలు వచ్చాయని తెలిపాడు. అవకాశాలు దొరకని రోజుల్లో ఆ గొడవలు మరింత పెరిగాయని, తనకు నచ్చిన దర్శకుల గురించి చెబుతూ... ఎస్.ఎస్. రాజమౌళి, రాజ్‌కుమార్ హిరానీ, జోయా అక్తర్ సినిమాల్లో ఒక్కసారైనా నటించాలని కోరిక ఉందని అన్నాడు. అలాగే స్ఫూర్తిగా భావించే వ్యక్తుల విషయానికి వస్తే, ఒత్తిడిని కూల్‌గా ఎదుర్కొనే క్రీడాకారులే తనకు ఆదర్శమని, ముఖ్యంగా ఎంఎస్ ధోనీ, లియోనెల్ మెస్సీలను ఆరాధిస్తానని చెప్పాడు. ఒక సినిమా ఒప్పుకుంటే స్క్రిప్ట్ నుంచి డాన్స్ వరకు ప్రతి అంశంలో పూర్తిగా లీనమై పనిచేస్తానని వెల్లడించాడు. ఇష్టమైన కథానాయికల విషయానికి వస్తే.. అనుష్క శెట్టి, కంగనా రనౌత్, ఆలియా భట్ పేర్లు చెప్పాడు. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'లో అనుష్కతో కలిసి నటించడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని తెలిపాడు. మొత్తంగా చూస్తే, కష్టాల నుంచి వచ్చిన అనుభవాలతో, స్పష్టమైన ఆలోచనలతో ముందుకు సాగుతున్న నవీన్ పోలిశెట్టి, 'అనగనగా ఒక రాజు'తో మరోసారి ప్రేక్షకులను నవ్విస్తూ, ఆలోచింపజేస్తాడన్న నమ్మకం అభిమానుల్లో బలంగా కనిపిస్తోంది.

# అది నాకు కొత్తగా అనిపించింది



అది నాకు కొత్తగా అనిపించిందిమెగాస్టార్ చిరంజీవి... హిట్ మెషిన్ అనిల్ రావిపూడి ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ 'మన శంకర వర ప్రసాద్ గారు' తో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఉత్సాహాన్ని మరింత పెంచుతూ విక్టరీ వెంకష్ కీలక పాత్రతో నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రంలో నయనతార కథానాయికగా నటిస్తుండగా, అర్చన ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. 'మన శంకర వర ప్రసాద్ గారు' సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా జనవరి 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అనిల్ రావిపూడి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ "ఇప్పటి వరకు టీజర్, ట్రైలర్‌లో ఎక్కడా కూడా చూపించని ఒక ఎమోషనల్ పాయింట్ ఈ సినిమాలో ఉంది. అది స్క్రీన్ మీద చూడాలి. సినిమాలో కామెడీతో పాటు ఒక బలమైన ఎమోషనల్ రైడ్ ఉంటుంది. చిరంజీవి, నయనతార, పిల్లల మధ్య వచ్చే సన్నివేశాలు చాలా హృద్యంగా ఉంటాయి. - భార్యాభర్తల మధ్య ఒక సమస్య వచ్చినప్పుడు వాళ్ళు ఎలా దాన్ని హ్యాండిల్ చేస్తారనేది చాలా కొత్త కోణంలో ఈ సినిమాలో చూపించడం జరిగింది. అది కచ్చితంగా అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. ఆ ఎమోషన్ స్క్రీన్ మీద చూస్తున్నప్పుడు ప్రతి ఒక్కరు ఇది కరెక్టే కదా అని ఫీల్ అవుతారు. చిరంజీవికి నేను చెప్పిన ఐడియా చాలా నచ్చింది. అలాగే క్యారెక్టరైజేషన్ కూడా చాలా నచ్చింది. ఈ మధ్యకాలంలో క్యారెక్టరైజేషన్‌తో పాటు నడిచే కథ నేను చేయలేదు. ఒక కథని హీరో పాయింట్ ఆఫ్ వ్యూ నుంచే తీసుకెళ్లడం అనేది నాకు కొత్తగా అనిపించింది. -చిరంజీవి కమ్ బ్యాక్ తర్వాత అన్నయ్య, బావగారు బాగున్నారా, చూడాలని ఉంది లాంటి ఫ్యామిలీ జోనర్ ని ఆయన టచ్ చేయలేదు. అది ఎప్పుడు నాకు మైండ్‌లో ఉంది. ఇది చాలా అద్భుతమైన బ్లాక్‌బస్టర్స్ వున్న జానర్. ఈ జానర్ లో ఆయనకు సినిమా చేయాలనే ఆలోచనతో ఈ కథని సిద్ధం చేశాను. -చిరంజీవి చేసే అల్లరి, ఎమోషనల్ మూమెంట్స్ అన్నీ కూడా ప్రేక్షకులు అందరినీ ఒక టైం మిషన్‌లో తీసుకెళ్ళినట్టుగా ఉంటాయి. ఆయన్ని నటుడిగా, వ్యక్తిగా అభిమానించే అందరూ సినిమా చూసిన తర్వాత 'వావ్' అంటారనే నమ్మకం వుంది.- చిరంజీవి లాంటి మెగాస్టార్ ఉన్నప్పుడు ఆయనకు తగ్గట్టు మాస్ ఎలిమెంట్స్ ఉండాలి. యాక్షన్, ఫన్ ఉండాలి. ఆయన ఇమేజ్ ని కొనసాగిస్తూ సినిమా చేయడం జరిగింది. అందరికీ నచ్చే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. ఈ సినిమా కోసం చిరంజీవి, వెంకటేష్ నాకు చాలా స్వేచ్ఛ ఇచ్చారు. చిరంజీవి, వెంకటేష్‌తో కలిసి చేసిన 18 రోజులు షూటింగ్ చేయడం నా కెరీర్‌లో మరచిపోలేని అనుభవాన్నిచ్చింది. - చిరంజీవి, వెంకటేష్ కాంబినేషన్ 20 నిమిషాలు నాన్ స్టాప్‌గా ఉంటుంది. ఇందులో వెంకటేష్ కర్ణాటక నుంచి వచ్చిన వెంకీ గౌడ అనే ఒక మైనింగ్ బిజినెస్ మ్యాన్ క్యారెక్టర్‌లో కనిపిస్తారు. ఆయన పాత్ర చాలా విభిన్నంగా ఉంటుంది. ఈ సినిమాకు భీమ్స్ అద్భుతమైన సంగీతాన్ని ఇచ్చాడు. పాటలన్నింటికీ మంచి స్పందన వస్తోంది"అని అన్నారు.

## ఫేక్ రివ్యూలు, రేటింగులకి చెక్...



తెలుగు చిత్ర పరిశ్రమలో ఫేక్ రివ్యూలు, ఫేక్ రేటింగ్స్‌పై జరుగుతున్న చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. ఇటీవల ఈషా నిర్మాతలు తమ సినిమాపై కావాలని నెగిటివ్ క్యాంపెయిన్ జరుగుతోందని ఆరోపించడంతో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. సినిమా చూడకుండానే దీశీశీనివీఎూష్ట్రశీష వంటి ప్లాట్‌ఫామ్స్‌లో తప్పుడు రేటింగ్స్ ఇస్తున్నారని వారు వాపోయారు. ఈ నేపథ్యంలో ఫేక్ రివ్యూలకు చెక్ పెట్టేందుకు కొత్త విధానం తీసుకొస్తున్నారు. ఇది చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ గారు సినిమా నుంచి అమల్లోకి రానుంది. ఈ విధానం వల్ల నిజమైన ప్రేక్షకుల అభిప్రాయమే బయటకు వచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. తెలుగు చిత్ర పరిశ్రమలో గత కొంతకాలంగా ఫేక్ రివ్యూలు, ఫేక్ రేటింగ్స్పై తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఒక సినిమా విడుదల కాగానే దాని కంటెంట్ కంటే ముందే సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం మొదలవడం, ముఖ్యంగా స్టార్ హీరోల సినిమాలను టార్గెట్ చేస్తూ యాంటీ ఫ్యాన్స్ దుష్ప్రచారం చేయడం ఇప్పుడు సాధారణంగా మారింది. ఇటీవల ఇదే అంశంపై ఈషా సినిమా నిర్మాతలు బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేయడం ఇండస్ట్రీని కుదిపేసింది. సినిమా విడుదలకుముందే, ఇంకా కొన్ని దేశాల్లో రిలీజే కాని సినిమాలకు కూడా పేజీల కొద్దీ నెగిటివ్ రేటింగ్స్ రావడంపై వారు అనుమానాలు వ్యక్తం చేశారు. థియేటర్లలో హౌస్‌ఫుల్స్ నడుస్తున్నా, ఆన్‌లైన్‌లో మాత్రం కావాలని తక్కువ రేటింగ్స్ ఇస్తూ చిన్న సినిమాలను దెబ్బతీయడానికి "పెయిడ్ మాఫియా" పనిచేస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా దీశీశీనివీఎూష్ట్రశీష వంటి బుకింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో సినిమా చూడకుండానే రేటింగ్ ఇవ్వడం పెద్ద సమస్యగా మారిందని నిర్మాతలు పేర్కొన్నారు. ఇలాంటి నేపథ్యంలోనే ఇప్పుడు ఇండస్ట్రీలో ఒక సరికొత్త విధానం అమలుకు సిద్ధమవుతోంది. బుకింగ్ పార్ట్‌నర్ రేటింగ్స్‌ను దుర్వినియోగం చేసి సినిమాలకు నష్టం కలిగిస్తున్న యాంటీ ఫ్యాన్ క్యాంపెయిన్లకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో రెండు యాంటీ పైరసీ యాప్స్'బ్లాక్ బిగ్', 'అప్లిక్స్'రంగంలోకి దిగుతున్నాయి. ఈ యాప్స్ ద్వారా ఇకపై ఫేక్ రివ్యూలు, ఉద్దేశపూర్వకంగా ఇచ్చే నెగిటివ్ రేటింగ్స్, డబ్బులు ఇచ్చి వేయించే కామెంట్లకు అవకాశం ఉండదని సమాచారం. సినిమా చూసిన ప్రేక్షకుల వేరిఫైడ్ స్పందన ఆధారంగానే రివ్యూలు, రేటింగ్స్ కనిపించేలా ఈ విధానాన్ని రూపొందించారు. ఈ ప్రయోగం చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ గారు సినిమా నుంచి ప్రారంభం కావడం విశేషం. బుకింగ్ పార్ట్‌నర్ రేటింగ్స్‌లో కావాలని మార్పులు చేయడం, లేదా ఒకే గ్రూప్ ద్వారా భారీగా తక్కువ రేటింగ్‌లు వేయించడం ఇకపై సాధ్యం కాదని చెబుతున్నారు. దీంతో సినిమాకు నిజంగా ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన మాత్రమే బయటకు వస్తుంది. ఈ మార్పు వల్ల కంటెంట్ బలంగా ఉన్న సినిమాలకు, ముఖ్యంగా చిన్న మరియు మిడిల్ బడ్జెట్ చిత్రాలకు పెద్ద మేలు జరుగుతుందనే అభిప్రాయం వినిపిస్తోంది. నోటి మాట ప్రచారం (వర్డ్ ఆఫ్ మౌత్)కు ప్రాధాన్యం పెరిగి, ఫేక్ నెగిటివిటీ ప్రభావం తగ్గే అవకాశముంది. అయితే ఈ కొత్త విధానం అందరికీ లాభమేనా అంటే కాదనే చెప్పాలి. ఇప్పటివరకు కొంతమంది నిర్మాతలు డీలింగ్స్ ద్వారా తమ సినిమాలకు అవసరానికి మించి పాజిటివ్ రేటింగ్స్ వేయించుకుని, "సూపర్ బజ్" అంటూ ప్రచారం చేసుకున్న సందర్భాలున్నాయి. కొత్త వ్యవస్థ అమలులోకి వస్తే ఇలాంటి స్కామ్‌లకు కూడా పూర్తిగా బ్రేక్ పడనుంది. ప్రేక్షకుల నుంచి సరైన స్పందన లేని సినిమాలకు ఆన్‌లైన్‌లో కృత్రిమ హైప్ క్రియేట్ చేయడం ఇక కష్టమే. ఈ కోణంలో చూస్తే, ఫేక్ పాజిటివిటీపై ఆధారపడే వారికి ఇది గట్టి ఝలక్‌గా మారనుంది. మొత్తంగా చూస్తే, ఫేక్ రివ్యూలుఫేక్ రేటింగ్స్ సమస్యపై ఇండస్ట్రీలో మొదలైన ఈ చర్చ, ఈషా నిర్మాతల ఆరోపణలతో మరింత బలపడింది. ఇప్పుడు మన శంకర వరప్రసాద్ గారు సినిమాతో మొదలయ్యే ఈ సరికొత్త విధానం విజయవంతమైతే, తెలుగు చిత్ర పరిశ్రమలో రివ్యూల విశ్వసనీయత పెరిగే అవకాశం ఉంది. ప్రేక్షకుడి నిజమైన అభిప్రాయమే తుది మాటగా మారే దిశగా ఇది ఒక కీలకమైన అడుగు అని చెప్పవచ్చు.

# హిస్టరీ క్రియేట్ చేసిన ప్రభాస్.. ఇండియన్ సినిమాలో ఒకే ఒక్కడు..!




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డు సృష్టించారు. 'ది రాజాసాబ్' చిత్రం తొలి రోజే ₹112 కోట్లు వసూలు చేయడంతో, భారత సినీ చరిత్రలో ఆరు సినిమాలకు ₹100 కోట్ల ఓపెనింగ్స్ సాధించిన ఏకైక హీరోగా నిలిచారు. డివైడ్ టాక్ తోనూ రికార్డులు సృష్టించడం రెబల్ స్టార్ కే సాధ్యమని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ప్రభాస్ బాక్సాఫీస్ కింగ్ అని, బాక్సాఫీస్ బాద్‌షా అని కొనియాడుతున్నారు. 'స్పిరిట్', 'ఫౌజీ' చిత్రాలతో ఇండియన్ సినిమా రికార్డులు గల్లంతు అవుతాయని అంటున్నారు. ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ సూపర్ స్టార్ గా అవతరించారు ప్రభాస్. తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన నటులలో ఆయనొకరు. ఎస్.ఎస్ రాజమౌళి సపోర్టుతో 'బాహుబలి' సిరీస్‌తో భారతీయ సినిమా ముఖచిత్రాన్నే మార్చేసిన డార్లింగ్.. నిజమైన పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. ఎలాంటి సినిమా అయినా, దర్శకుడు ఎవరైనా.. ప్రభాస్ పేరు పోస్టర్ మీద ఉంటే చాలు బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురవాల్సిందే అనే స్థాయికి చేరుకున్నారు. తన కటౌట్‌కు ఉన్న క్రేజ్ తో తన ప్రతి సినిమాతోనూ సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నారు. తాజాగా మరో అరుదైన ఫీట్ అందుకున్నారు. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ ఫాంటసీ మూవీ 'ది రాజాసాబ్'. ఈ చిత్రం జనవరి 9న సంక్రాంతి కానుకగా థియేటర్లలో విడుదలైంది. ప్రభాస్ వింటేజ్ స్వాగ్, కామెడీ టైమింగ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రీమియర్స్ నుంచి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ ఓపెనింగ్స్ రాబడుతోంది. తొలి రోజే ప్రపంచవ్యాప్తంగా ₹112 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. హారర్ కామెడీ జోనర్‌లో ఫస్ట్ డే ₹100 కోట్లు దాటిన మొట్ట మొదటి సినిమాగా రికార్డ్ క్రియేట్ చేరింది. దీంతో ప్రభాస్ ఖాతాలో మరో రికార్డ్ చేరిపోయింది.

Publisher, Owner And Editor Boddupally Mallaiah 3-62, Yendabetla, Nagarkurnool, Telangan - 509209, Printer, Gundur Shyam , Shyam Agencies Telkapally(M), Telangana 509385. Published 2-48/1 Near Hanuman Temple, Telkapally(M) Dist.Nagarkurnool, Telangana 509385.
Ph 9441946907, Email : nijamenijayithi@gmail.com Website : nijamenijayithi.com